RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 37 ISSUE NO : 37 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | గురువారం, జూలై, 24 , 2025 Thursday, July, 24, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-




ఐక్యరాజ్య సమితిలో

పాకిస్థాన్‌పై విరుచుకుపడిన

## భారత్

- పాకిస్థాన్ మతోన్మాదం, ఉగ్రవాదంలో కూరుకుపోయిందన్న భారత్

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితి (యూఎన్) వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. పాకిస్థాన్‌ను "మతోన్మాదం, ఉగ్రవాదంలో కూరుకుపోయిన, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి సీరియల్ రుణగ్రహీత"గా అభివర్ణించింది. అంతర్జాతీయ శాంతి, భద్రతను ప్రోత్సహించడం, ద్వైపాక్షిక చర్చల ద్వారా వివాదాల పరిష్కారం అనే అంశంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో జరిగిన ఉన్నత స్థాయి బహిరంగ చర్చలో భారత్ శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.



## మూడో రోజూ రభసే..

చర్చలు ప్రారంభం కాకుండానే నేటికి ఉభయసభలు వాయిదా

న్యూ ఢిల్లీ : పహల్గాం ఉగ్ర దాడి, ఓటర్ల జాబితా సవరణ అంశాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్నాయి. సమావేశాలు ప్రారంభమైన వరుసగా మూడోరోజైన బుధవారం కూడా ఉభయసభలు అట్టుడికాయి. ప్రతిపక్షాల ఆందోళనలతో ఎలాంటి చర్చ జరగకుండానే ఉభయసభలు వాయిదా పడ్డాయి. ఎగువ సభ, దిగువ సభ రేపు ఉదయం 11 గంటలకు వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు ఉభ యసభలు మొదలవగానే..



వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించిన

## ట్రంప్..

ఆ డీల్‌ను ఆహ్వానించిన జపాన్ ప్రధాని

టోక్యో: జపాన్‌తో భారీ వాణిజ్య ఒప్పందం జరిగినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో జపాన్ ప్రధాని షిగేరు ఇసిబా స్పందించారు. ట్రంప్ ప్రకటనను ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఫిలిప్పీన్స్‌తో జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని కూడా ట్రంప్ ప్రకటించారు. జపాన్ టారిఫ్ రేట్‌ను 15 శాతానికే ఫిక్స్ చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న దేశాల్లో ఈ రేట్ అత్యంత కనిష్టమైంది. జపాన్ వాహనాలపై విధిస్తున్న రేట్‌ను 25 శాతానికి పెంచాలనుకున్నారు,



## హస్తినలో రేవంత్ రెడ్డి

న్యూ ఢిల్లీ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేటి ఉదయం హస్తినాకు వెళ్లారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్రం పంపిన బిల్లు పార్లమెంట్ లో ఆమోదం పొందేలా అన్ని పార్టీల మద్దతు కూడగట్టడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పెద్దలను ఈ టూర్ లో భాగంగా కలవనున్నారు.



మహాలక్ష్మితో ఆర్టీసికి

## లాభాల పంట

- ఉచిత ప్రయాణంతో ఆర్టీసికి రూ.6680 కోట్ల ఆదాయం
- 200 కోట్ల ఉచిత ప్రయాణాలపై డిప్యూటి సిఎం వెల్లడి
- మహిళలకు శుభాకాంక్షలు చెప్పిన భట్టి

హైదరాబాద్, తెలంగాణ దిశ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ.6680 కోట్ల రూపాయలు ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ లోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో మహా లక్ష్మి సంబరాలు చేపట్టింది. ఉచిత బస్సు ప్రయాణాల వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హాజర య్యారు. ఆర్టీసీ వేడుకలలో పాల్గొన్న డిప్యూటీ- సీఎం భట్టి రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు.



కంచగచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై

## సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

- నరికిన చెట్ల స్థానంలో మొక్కలు పెంచాలన్న కోర్టు
- పర్యావరణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులను జైలుకు పంపిస్తామని హెచ్చరిక


ఢిల్లీ,:కంచగచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు ఈరోజు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. నరికిన చెట్ల స్థానంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పునరుద్ధరించాలని అధికారులకు సూచించింది. లేదంటే అధికారులను జైలుకు పంపిస్తామని మరోమారు హెచ్చరించింది. ఈ మేరకు హెచ్ సీయూ సమీపంలోని కంచగచ్చిబౌలి భూముల వివాదంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ భూమిలో పర్యావరణ పునరుద్ధరణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మంగళవారం దాఖలు చేసిన అఫిడవిట్ ను ధర్మాసనం పరిశీలించింది. గత విచారణలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు తెలిపింది. కంచగచ్చిబౌలి భూముల్లో పనులు నిలిపివేసి పర్యావరణ పునరుద్ధరణకు కృషి చేస్తున్నట్లు అఫిడవిట్ లో పేర్కొంది.



## దోచేస్తున్న ప్రైవేట్ ఫైనాన్సులు?

- రుణాలు తీసుకునేంత వరకూ సులభమైన పద్ధతి అంటూ..
- రుణం పొందిన తరువాత ఎక్కువ మొత్తంలో వడ్డీ వసూలు..

నిజామాబాద్, జూలై 23, తెలంగాణ దిశ : మాన్యులనే అస్త్రంగా చేసుకొని కొందరు, కొన్ని ప్రైవేటు ఫైనాన్సు సంస్థలు రెచ్చిపోతున్నారు. గ్రామాల్లోకి వచ్చి రుణా లు ఇస్తామంటూ తిరుగుతున్నారు. పెంకు టిల్లు, రేకుల షెడ్డు ఉన్నా రుణాలు ఇస్తామంటూ నమ్మ బలుకుతున్నారు. రుణాలు తీసుకున్న తర్వాత పిడిస్తున్నారు. సక్రమంగా నెలసరి కిస్తీలు చెల్లించని వారి పై బెదిరింపు లకు పాల్పడుతున్నారు.పెంకుటిల్లు మీద సుమారు 3 నుంచి 4 లక్షల వరకు, రేకుల ఇంటికి 3 లక్షలు, స్లాబ్ ఉన్న ఇంటికి 8 లక్షల వరకు రుణాలు ఇస్తామంటూ గృహాలపై రుణాలు ఇచ్చే వారు తిరుగుతున్నారు. రుణాలు తీసుకునేంత వరకూ సులభమైన పద్ధతి అంటూ అక్కడే లాగిన్ పూర్తి చేసి ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నారు. అయితే నెలనెలా తిరిగి చెల్లించే కిస్తీ డబ్బుల సమయంలో చెల్లించాల్సిన దాని కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. రుణం పొందే వరకు మాయ మాటలతో మభ్యపెడుతున్నారు.




పరవళ్లు తొక్కుతున్న..

## బొగత జలపాతం

- సందర్శకులకు అనుమతి నిరాకరణ

ములుగు , తెలంగాణ దిశ : రాష్ట్రంలోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన తెలంగాణ నయాగరా గా పేరు గాంచిన బొగత జలపాతాల్లో వరద ఉధృతితో నీటి ప్రవాహం భారీగా పెరిగింది. పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో జలపాతాలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జలపాతాల వద్ద సందర్శకుల రాకను అధికారులు తాత్కాలికంగా నిషేధించారు. వర్షాల ధాటికి జలపాతాల వద్ద నీటి ప్రవాహం అత్యంత వేగంగా సాగుతోంది.



గాజాలో కొనసాగుతున్న..

## ఇజ్రాయెల్ దాడులు

20 మంది పాలస్తీనియన్లు మృతి

గాజా :హమాస్ మిలిటెంట్ల ఏరివేతే లక్ష్యంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తోంది. గాజా లోని పలు ప్రాంతాలపై వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. తాజాగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 20 మంది పాలస్తీని యన్లు ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా ఆరోగ్య అధికారులు తెలిపారు. గాజా నగరానికి పశ్చిమాన సముద్ర తీరాన ఉన్న శణార్థి శిబిరంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలపై ఇజ్రాయెల్ దాడి జరిపినట్లు పేర్కొన్నారు.

## రూ.13 నుంచి 16 లక్షల్లో సింగిల్ బెడ్ రూమ్, రూ. 19 నుండి

# 22 లక్షల్లో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు విక్రయాలు







## - రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ గౌతమ్

**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 23, (తెలంగాణ దిశ):** పేద ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను నిర్ణీత ధర నిర్ధారించి విక్రయించనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ విపి. గౌతమ్ తెలిపారు. లాభాపేక్ష లేకుండా మార్కెట్ ధరల కంటే తక్కువలో అందరికీ అందుబాటులో ఉండే ధరల్లోనే ఈ ఫ్లాట్లను కేటాయిస్తున్నామని ఆయన అన్నారు. స్వగృహ కార్పొరేషన్ ఉన్నతాధితాధికారులు సి. భాస్కర్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులతో కలిసి బుధవారం పోచారం, నాగోలు బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల సముదాయాలను సందర్శించారు. ఈ సందర్భంగా పోచారం వద్ద మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. అల్మార్లాలు, కబ్ బోర్డులు కూడా నిర్మితమై "రెడీ టూ ఆక్యుపై" గా ఉన్న ఈ ఫ్లాట్లను కొనుగోలు చేసేందుకు ప్రజలకు మంచి అవకాశమన్నారు. రూ. 13 నుంచి రూ. 16 లక్షలల్లో సింగిల్ బెడ్ రూం, 19 నుండి 22 లక్షల్లో డబుల్ బెడ్ రూం ఫ్లాట్లు బహిరంగ మార్కెట్ లో ఎక్కడా లభించవన్నారు. ఫ్లాట్ విస్తీర్ణం ఎంత ఉంటే అంత మేరకే ధరలు నిర్ధారించామని, అదే ప్రైవేటు సంస్థలైతే ఇందుకు అదనంగా మరో 20-30 శాతం అదనంగా విస్తీర్ణానికి ఖరీదు కడతారన్నారు. రాజీవ్ స్వగృహ లాభాపేక్షమైన సంస్థ కాదనీ, కనుకనే వాస్తవ విస్తీర్ణంలోని కట్టడపు విస్తీర్ణాన్ని మాత్రమే పేర్కొంటున్నామని ఆయన వివరించారు. పోచారం సద్భావనా టౌన్ షిప్ లో ఇప్పటికే సుమారు వెయ్యికు పైగా కుటుంబాలు నివసిస్తున్నారని, సింగిల్ బెడ్ రూం 255 ఫ్లాట్లు, డబుల్ బెడ్ రూం ఫ్లాట్లు 340 ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని కూడా లాటరీ విధానంలో కేటాయిస్తామన్నారు. గతంలో ఎవరికి ఏ ఫ్లాట్ కేటాయించలనే దానిని లాటరీ ద్వారా నిర్ధారించేవారని, కానీ ఈసారి ఒకే దరఖాస్తుతో, కొనుగోలు దారులు తమకు నచ్చిన ఫ్లాట్లను ఎంపిక చేసుకునే ఆప్షన్లు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా ఈ ఫ్లాట్లను ప్రత్యేకంగా మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకునే నిర్మించినందున, వారి సౌలభ్యం కోసం, ప్రాజెక్టు టౌన్ షిప్ లోనే, ఆసక్తి ఉన్న వారికి బ్యాంకు లోన్లు ఇచ్చేలా ఆయా బ్యాంకర్లతో సమన్వయం చేసుకుంటా వారి కౌంటర్లను కూడా ఏర్పాటు చేశామని గౌతమ్ వివరించారు. ఇవే కాకుండా పోచారం ప్రాంతంలోనే వివిధ ఉద్యోగ సంఘాలు, కో ఆపరేటివ్ సొసైటీలు, ఇతరత్రా సంస్థలు ఏక మొత్తంగా కొనుగోలు చేసేలా రూఫ్ పూర్తయి, గోడల వరకు నిర్మితమైన టవర్లను కూడా విక్రయిస్తున్నామన్నారు. వీటిని కొనుగోలు చేయడానికి సుమారుగా 20 గ్రూపుల వరకు ముందుకు వచ్చాయని చెప్పారు. స్థానికంగా టౌన్ షిప్ నకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే అంశంపై అధికారులతో మాట్లాడతానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అన్ని సదుపాయాలతో నిర్మితమై న పోచారం రాజీవ్ స్వగృహ టౌన్ షిప్ లో మార్కెట్ కంటే తక్కువకు అందుబాటులో ఉండే ధరలతో సొంత ఇంటి కలను సాకారం చేసుకునేలా ప్రభుత్వం కల్పిస్తున్న సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## లోతట్టు ప్రాంతాలలో అవసరమైన

# సౌకర్యాలను కల్పిస్తాం

### - జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్



జవహర్ నగర్, జూలై 23, (తెలంగాణ దిశ) : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలలో బుధవారం మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా పాపయ్య నగర్‌తో పాటు పలు కాలనీలో పర్యటించి స్థానికులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం రెడ్డిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జెసిబి సహాయంతో నీటిని పంపే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. జవహర్ నగర్ మున్సిపాలిటీలో నిధుల కొరత ఉండడంతో ఈ లోతట్టు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం కల్పించలేక పోతున్నామని, అయినప్పటికీ తాత్కాలిక మరమ్మత్తులతో కొంత మేర ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారాన్ని చేస్తామని తెలిపారు. పాపయ్య నగర్ కాలనీ ప్రజలతో పాటు అనేక కాలనీల ప్రజలకు రెడ్డిశెట్టి శ్రీనివాస్ ప్రతి సంవత్సరం అండగా నిలుస్తూ వారి ఇబ్బందులను పరిష్కరిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## పర్యావరణ పరిరక్షణతోనే

## మానవ మనుగడ : ఎమ్మెల్యే వివేకానంద్





**కుత్బుల్లాపూర్, జూలై 23,(తెలంగాణ దిశ):** గాజుల రామారం డివిజన్ ఆక్సిజన్ పార్క్‌వద్ద రాష్ట్ర అటవీ శాఖఆధ్వర్యంలో నిర్వహించిన "వన మహొత్సవం" కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై చెట్లను నాటారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించినపుడే సమృద్ధిగా వర్షాలు, వాతావరణ సమతుల్యత ఉంటుందని, ప్రతీ ఒక్కరూ విధిగా చెట్లను నాటి సంరక్షించినట్లయితే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్, సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, బీట్ ఆఫీసర్ ఎండి. అర్షద్, దూలపల్లి రేంజ్ సిబ్బంది, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు,పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, స్థానిక కాలనీల సంక్షేమ సంఘం నా యకులు విజయ్ రాంరెడ్డి, కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్,రుద్ర అశోక్, ఇబ్రహీం ఖాన్,చిన్నా చౌదరి, రాములు గౌడ్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల

## పరిష్కారానికి 90 రోజుల మధ్యవర్తిత్వ డ్రైవ్




**కుషాయిగూడ, జూలై 23, (తెలంగాణ దిశ) :**
కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి 90 రోజుల మధ్యవర్తిత్వ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్. శ్రీదేవి కార్యదర్శి డి.కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.జూలై 1,2025 నుండి నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(ఎన్ఎల్ఎస్ఎ), దేశంలోని మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసిపిసి) సహకారంతో స్పెషల్ మీడియేషన్ డ్రైవ్-మీడియేషన్ ఫర్ ది నేషన్' క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఇది దేశంలోని అన్ని తాలూకా కోర్టులు, జిల్లా కోర్టులు, హైకోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడానికి 90 రోజుల మధ్యవర్తిత్వ డ్రైవ్ అని వారు వివరించారు. జిల్లా అంతటా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో మధ్యవర్తిత్వం నిర్వహించడం ద్వారా సామరస్యపూర్వక పరిష్కారం తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. దీని కింద వర్తించే కేసులలో గరిష్ట సామరస్యపూర్వక పరిష్కారాన్ని సాధించే లక్ష్యంతో, కోర్టుల నుండి కేసులను మధ్యవర్తిత్వానికి సూచించడానికి ప్రయత్నాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో, వివాహ వివాదాలు, ప్రమాద క్లెయిమ్‌లు, గృహహింస, చెక్కు బౌన్స్, వాణిజ్య వివాదాలు, సర్వీస్ విషయాలు, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, వినియోగదారుల వివాదాల కేసులు, రుణ రికవరీ కేసులు, విభజన కేసులు, తొలగింపు కేసులు, భూసేకరణ కేసులు, ఇతర తగిన సివిల్ కేసులకు సంబంధించిన వారి పెండింగ్ కేసులను సామరస్యపూర్వక పరిష్కారం కోసం కోర్టులలో మధ్యవర్తిత్వం చేయమని వారు పార్టీలను అభ్యర్థించారు. దీని వల్ల ప్రజలు పెండింగ్‌లో తమ కేసులను కోర్టులో మధ్యవర్తిత్వం వహించాలని, ఆ కేసులను పరిష్కరించే ప్రయత్నాలలో పూర్తి సహకారాన్ని అందించాలని వారు కోరారు.

## పవన్ స్ట్రాటజీ తో జగన్‌కు

# ఇబ్బందులు తప్పవా..?

విజయవాడ: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీని నియోజకవర్గాల్లోబలోపేతం చేయడం మీద కంటే ఎక్కువగా వ్యూహాలపైనే ఆధారపడుతున్నట్లుంది. అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత కూడా పవన్ కల్యాణ్ నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడం, ప్రతి నియోజకవర్గంలో జనసేన ఇన్ ఛార్జులను నియమించకపోవడం వంటివి చేయకపోవడం కూడా వ్యూహంలో భాగమేనని అంటున్నారు. తక్కువ స్థానాలు తీసుకుని అయినా హండ్రెడ్ పర్సెట్ స్ట్రయిక్ రేటును సాధించడమే లక్ష్యంగా ఆయన పనిచేయాలనుకుంటున్నారు. మరొక వైపు చంద్రబాబు నాయుడుతోనూ, ఢిల్లీలోని బీజేపీ పెద్దలతో సయోధ్యగా ఉంటూనే ముందు అనుభవం సంపాదించుకోవాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్లుంది.అందుకే అవకాశం ఉన్నప్పుడల్లా చంద్రబాబును తన మాటలతో ఆకాశానికి ఎత్తుతున్నారు. చంద్రబాబు నాయుడు పదిహేనేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలని చెబుతూ టీడీపీ కార్యకర్తలతో పాటు కమ్మ సామాజికవర్గం ఓటర్లకు కూడా పవన్ కల్యాణ్ దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తుంది. అదే సమయంలో పవన్ కల్యాణ్ నిరంతరం ప్రజల పక్షాన నిలబడతారన్న పేరును ఇప్పటికే తెచ్చుకున్నారు. ప్రధానంగా గిరిజనుల ఓట్లను ఆయన కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా ఎస్టీ నియోజకవర్గాల్లో వైసీపీ నేటికీ బలంగా ఉంది. అలాంటి చోట తాను తరుచూ పర్యటిస్తూ ఆ గ్రామాల్లో రహదారులను నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పవన్ చేస్తున్న ఈ ప్రయత్నాలతో ఎస్టీ నియోజకవర్గాలు కూటమి పార్టీలకు చేరువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సంపాదకీయం

## మోడీ దౌత్య ఫలితం


ముంబయి దాడుల నిందితుడు తహవ్వుర్‌రాణాను అమెరికా భారత్‌కు అప్పగించింది. ముంబయి దాడులకు బాధ్యుడైన తహవ్వుర్ రాణాను అమెరికా అప్పగించిందని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తెలిపింది. అప్పగింత ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు రాణా.. అమెరికాలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని ఎన్ఐఏ తెలిపింది. తేదీ 26 నవంబర్ 2008, ముంబైలో ఉగ్రవాద దాడి జరిగిన రోజు ఇదే. ఈ దాడి జరిగి దాదాపు 17 సంవత్సరాలు అయ్యింది. కానీ ఈ కుట్రలో నిందితులైన చాలా మందికి ఇంకా శిక్ష పడలేదు. ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారి తహవ్వూర్ రాణాను ఎట్టకేలకు అమెరికా నుండి భారతదేశానికి తీసుకువచ్చారు. ఇప్పుడు ఈ ఉగ్రవాద దాడిని ఎలా చేశారు..? ఏ కుట్ర పన్నారో త్వరలో బయటపడనుంది. కుట్ర వెనుక దాగి ఉన్న అన్ని రహస్యాలు బయటపడతాయి. ముంబై దాడుల ప్రధాన నిందితుడు తహవూర్ రాణాను ఎన్ఐఏ అధికారులు పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచారు. అక్కడి నుంచి ఎన్ఐఏ అతని 18 రోజుల కస్టడీకి తీసుకుంది. నిందితుడు తహవూర్ రాణా అమెరికాలో నివసిస్తున్న పాకిస్తానీ పౌరుడు. రాణాను ఉరితీయాలనే డిమాండ్ ఉంది. అయితే భారతదేశంలో రాణా తరుఫున కేసును వాదించడానికి, అతనిని ఉరి నుండి కాపాడటానికి, న్యాయవాది పియూష్ సచ్‌దేవా వకల్తా పుచ్చుకున్నాడు. రాణాకు చట్టపరంగా ఉన్న దారులన్నీ మూసుకుపోవడంతో ఆయన అప్పగింత సాధ్యపడిందని తెలిపింది. తహవ్వూర్ రాణా 2013లో ఆయన స్నేహితుడు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీతో కలిసి ముంబై దాడులకు పాల్పడినందుకు, డెన్మార్క్‌లో దాడికి ప్రణాళిక వేసినందుకు అమెరికాలో ఆయన దోషిగా తేలారు. ఈ కేసుల్లో, తహవ్వూర్ హుస్సేన్ రాణాకు అమెరికా కోర్టు 14 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. భారీగా ఆయుధాలు ధరించి శిక్షణ పొందిన పది మంది లష్కరే తోయిబా ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న ముంబయిలోని అనేక ప్రదేశాలు, ప్రసిద్ధ భవనాలపై దాడులు చేశారు. ఈ దాడులు నాలుగు రోజుల పాటు కొనసాగాయి. 160 మందికి పైగా మరణించారు. ముంబయి నగరం 2008 నవంబర్ 26వ తేదీ రాత్రి, అకస్మాత్తుగా తుపాకీ కాల్పుల శబ్దంతో దద్దరిల్లింది. దాడి చేసిన వ్యక్తులు ముంబయిలోని రెండు ఫైవ్ స్టార్ హోటళ్ళు, ఒక ఆసుపత్రి, రైల్వే స్టేషన్లు, ఒక యూదు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. మొదట్లో ఇంత పెద్ద దాడి జరిగుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ క్రమంగా దాడి తీవ్రత అర్థమయింది. నవంబర్ 26వతేదీ రాత్రి, ఉగ్రవాద నిరోధక దళం చీఫ్ హేమంత్ కర్కరే సహా ముంబయి పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. లియోపోల్డ్ కేఫ్, ఛత్రపతి శివాజీ టెర్మినల్ వద్ద ప్రారంభమైన ఈ మారణకాండ తాజ్ మహల్ హోటల్ వద్ద ముగిసేలోపు దీనిని ఆపేందుకు భద్రతా సిబ్బందికి 60గంటల సమయం పట్టింది. 160మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దాడిచేయడానికి వచ్చినవారు రెండు గ్రూపులుగా విడిపోయినట్టు ముంబయి పోలీసులు, దర్యాప్తు అధికారులు చెప్పారు. వీరిలో ఇద్దరు వ్యక్తులు లియోపోల్డ్ కేఫ్‌లోకి చేరుకుని విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కేఫ్‌కి ఎక్కువగా విదేశీయులు వస్తుంటారు. అక్కడ ఉన్న ప్రజలకు ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపే వారు విచక్షణారహితంగా తూటాలు పేల్చి అక్కడి నుంచి పారిపోయారు. అధికారిక గణాంకాల ప్రకారం, లియోపోల్డ్ కేఫ్‌లో జరిగిన కాల్పుల్లో 10 మంది మరణించారు. దేశంలో అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో.. ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్ కూడా ఒకటి .ఆ సమయంలో అక్కడ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉన్నారు. దుండగులు ఒక్కసారిగా విచక్షణారహితంగా తూటాలు పేల్చారు. ఈ కాల్పుల్లో అజ్మల్ అమీర్ కసబ్, ఇస్మాయిల్ ఖాన్ పాల్గొన్నారని దర్యాప్తు అధికారులు తెలిపారు. తరువాత అజ్మల్ అమీర్ కసబ్ పట్టుబడ్డారు కానీ ఇస్మాయిల్ ఖాన్ చనిపోయారు. ఈ కాల్పుల్లో 58 మంది మరణించారు. పెద్దమొత్తంలో మందుగుండు సామగ్రితో దుండగులు ఈ హోటల్‌లోకి ప్రవేశించారు. ఆ సమయంలో అక్కడ 350 మందికి పైగా ఉన్నారని భావిస్తున్నారు. వారిలో చాలా మందిని దుండగులు బందీలుగా చేసుకున్నారు. దాడి చేసిన ఇద్దరు దుండగులను జాతీయ భద్రతా దళ సిబ్బంది హతమార్చారు. తాజ్ మహల్ హోటల్‌లో చెలరేగిన అగ్నిప్రమాదం ప్రజల గుండెల్లో అలానే ఉంది. కాల్పులు, పేలుళ్ల మధ్య, తాజ్ మహల్ హోటల్ కాలిపోవడాన్ని వారింకా మరచిపోలేరు. ఈ భవనం 105 సంవత్సరాల పురాతనమైనది. గేట్ వే ఆఫ్ ఇండియా సమీపంలో ఉన్న ఈ హోటల్‌కి ఎక్కువగా విదేశీ పర్యటకులు వస్తుంటారు. ఇక్కడి నుంచి సముద్ర తీరం కూడా కనిపిస్తుంది. హోటల్‌పై దాడి జరిగినప్పుడు, భోజన సమయం కావడంతో అక్కడ చాలా మంది గుమిగూడి ఉన్నారు. అప్పుడు దుండగులు అకస్మాత్తుగా కాల్పులు మొదలుపెట్టారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, తాజ్ మహల్ హోటల్‌లో 31 మంది మరణించారు. దాడి చేసిన నలుగురు వ్యక్తులు భద్రతా సిబ్బంది చేతిలో చనిపోయారు. కామా హాస్పిటల్ అనేది ఓ చారిటీ ఆసుపత్రి, దీనిని 1880లో ఒక సంపన్న వ్యాపారవేత్త నిర్మించారు. ముంబయి పోలీసుల కథనం ప్రకారం, నలుగురు దుండగులు ఒక పోలీసు వ్యాన్‌ను హైజాక్ చేసి, ఆపై ఆపకుండా కాల్పులు జరిపారు. ఈ క్రమంలో వారు ఆసుపత్రిలోపలికి కూడా ప్రవేశించారు. ఆసుపత్రి బయట జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాద నిరోధక దళం అధిపతి హేమంత్ కర్కరే, ముంబయి పోలీసులకు చెందిన అశోక్ కామ్టే, విజయ్ సలాస్కర్ మరణించారు. దుండ గులు నారిమన్ హౌస్‌ను కూడా లక్ష్యంగా చేసుకు న్నారు. దీనిని చాబాద్ లుబావిచ్ సెంటర్ అని కూడా పిలుస్తారు. నారిమన్ హౌస్‌లో కూడా అనేక మందిని బందీలుగా చేసుకున్నారు దుండగులు. ఈ భవనం యూదులకు సహాయం చేయడానికి నిర్మించిన కేంద్రం, ఇక్కడ యూదు పర్యటకులు కూడా తరచుగా బస చేసేవారు. ఈ కేంద్రంలో యూదు గ్రంథాల లైబ్రరీ, ప్రార్థనా స్థలం కూడా ఉన్నాయి. దుండగుల ఆట కట్టించేందుకు ఎన్ఎస్‌జీ కమాండోలు ఈ భవనం పక్కనున్న భవనంపైకి హెలికాప్టర్ నుంచి దిగారు. ఎస్ఎస్‌జీ కాల్పుల్లో దుండగులు మరణించారు. అయితే దుండుగుల అదుపులోని బందీలు కూడా చనిపోయారు. ఆ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు వ్యక్తులు, ఇద్దరు దుండగులు మరణించారు. చాబాద్ హౌస్‌పై జరిగిన దాడిలో, దానిని నడిపిన గాబ్రియల్, ఆయన భార్య రివ్కా కూడా మరణించారు.


# ప్రభుత్వ షటర్ల అద్దె దోచుకు తింటున్న అసోసియేషన్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

**రూ. కోటి అద్దె సొమ్మును రికవరీ చేయాలి**

**ప్రభుత్వ ఆస్తిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**





**ఏఎస్ రావునగర్, జూలై 23, (తెలంగాణ దిశ) :** అసంపూర్తిగా మిగిలిపోయిన ప్రభుత్వ కట్టడాన్ని “పూర్తి చేశామన్న” పేరుతోగత 12సంవత్సరాలుగా కబ్జాలో ఉంచుకొని లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్మును అద్దె రూపంలో దోచుకుంటున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతుంది. కాప్రా సర్కిల్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీలోని ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్స్ ను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్ అధికారులకు జిహెచ్‌ఎంసి ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారులు ఎన్ని లేఖలు రాసిన పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. ఎన్నో ప్రయత్నాల తర్వాత జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులు తక్షణమే షాపులను ఖాళీ చేయాలని అద్దెకు ఉన్న వారికి నోటీసులు ఇచ్చిన విషయం విధితమే. దీంతో రంగంలోకి దిగిన కాలనీ సంక్షేమ సంఘం ఎలాగైనా షాపులను తమ ఆధీనంలోనే ఉంచుకోవాలని దుర్బుద్ధితో చక్రం తిప్పుతుంది. ఇప్పటికే కాలనీ అసోసియేషన్ నిర్లక్ష్యం కారణంగా కాలనీలో విలువైన పార్కు స్థలం అన్యాక్రాంతమైంది. దీనికి కొందరు రాజకీయ నాయకులు వంత పాడడం ఆశ్చర్యం కలిగిస్తుంది. 2010 సంవత్సరం జూలై 7న అప్పటి ఉప్పల్ శాసనసభ్యులు బండారి రాజిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో అసంపూర్తిగా మిగిలిన నిర్మాణాన్ని రివైజ్డ్ ఎస్టిమేషన్ వేసి పూర్తి చేయాల్సిన జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా.. కాలనీ అసోసియేషన్ నేతలు రంగ ప్రవేశం చేసి నిర్మాణా న్ని 2013 జూలై 21న పూర్తి చేసారు.

అప్పటి నుంచి ఒక్కో షాపుకు రూ.50వేల అడ్వాన్స్ తోపాటు నెలకు రూ. 5నుంచి 6 వేలు అద్దెవసూళ్లు చేస్తున్నారు. ఇది కూడా షాప్ నిర్వాహకులు కేవలం నగదు రూపంలో మాత్రమే చెల్లించాలని కండిషన్ తోఅద్దెకించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో మొత్తం పది షెటర్లు ఉండగా, ఒక్కో షట్టర్ కు నెలకు రూ. 5 నుంచి ఆరు వేల అద్దె వేసుకున్న 72 నెలలకు రూ.72 నుంచి 87లక్షలను



అద్దె రూపంలో వసూళ్లు చేశారు.

దీనికి తోడు ఒక్కో షటర్ కు రూ. 50 వేల చొప్పున ఐదు లక్షల న గదు అసోసియేషన్ సేకరించినట్లు తెలిసింది.

ఇలా దాదాపు కోటి రూపాయల వరకు వసూళ్లు చేసిన అసోసియేషన్ నేతలు షాపులను జిహెచ్‌ఎంసి కి అప్పగించేందుకు అంగీకరించడం లేదు. ఇటీవల షాపులకు కేటాయించిన ఆస్తి పన్ను నోటీసులను సైతం జిహెచ్‌ఎంసి రద్దు చేసిన విషయం విధితమే. షాపులకు నెంబర్లు కేటాయించిన అధికారిపై సైతం విచారణ జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా జిహెచ్‌ఎంసి అధికారులు షాపులను స్వాధీనం చేసుకొని బహిరంగ వేలం ద్వారా కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.




### జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ షట్టర్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్ లోని షటర్లను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. షాపులను ఖాళీ చేయాలని కోరుతూ జిహెచ్‌ఎంసి నోటీసులు జారీ చేయడంతో షాపుల నిర్వాహకుల అభ్యర్థన మేరకు ఆయన షాపులను పరిశీలించారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో మాట్లాడి కొన్ని రోజుల పాటు యదావిధిగా షటర్లు నడిపేలా చూడాలని షాపుల నిర్వాహకులు కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జై జవాన్ కాలనీ అధ్యక్షుడు తిరుమలయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, కుమారస్వామి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### బహిరంగ వేలంలో షాపులను కేటాయించాలి

**- రూ కోటి అద్దె రికవరీ చేయాలి..గగన్**



ఏఎస్ రావు నగర్ డివిజన్ జై జవాన్ కాలనీలోని షాపులను జిహెచ్‌ఎంసి స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం ద్వారా షాపులను కేటాయించాలని సమాచార హక్కుసాధన సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ డిమాండ్ చేశారు. సుమారు 12 సంవత్సరాల అద్దె రూ. కోటి నిధులను కాలనీ సంక్షేమం సంఘం నుంచి రికవరీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో అనేక ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారుల్లో స్పందన లేకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. ఇంటి నెంబర్లు రద్దు చేయడంతో పాటు షాపు నిర్వాహకులకు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం అభినందనీయమన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి షటర్లను స్వాధీనం చేసుకొని బహిరంగ వేలం వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ - జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 23, (తెలంగాణ దిశ) :** మల్కాజిగిరి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కలిసి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ ఆస్పత్రిలోని జెరియాట్రిక్ వార్డు (వృద్ధుల చికిత్స విభాగం), జిల్లా కేన్సర్ సెంటర్, పెడియాట్రిక్ వార్డు (శిశువైద్య విభాగం), ఔట్ పేషెంట్ వార్డు తదితర విభాగాలను పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న చికిత్సను సమీక్షించి,వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై వివరంగా విచారణ చేశారు. ఆపరేషన్ థియేటర్లను పరిశీలించిన కలెక్టర్ ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు, శస్త్రచికిత్సల (ఆపరేషన్ల) సంఖ్యపై వైద్యుల వద్ద నుండి వివరాలు సేకరించారు. ఫార్మసీలో ఉన్న మందుల నిల్వలు, వాటి సరఫరా, ఈ–ఔషధి పోర్టల్ పనితీరు గురించి సమీక్షించారు. అలాగే ఎబిహెచ్ఎ కార్డుల పంపిణీ, ల్యాబ్ సదుపాయాల కింద తీసుకున్న శాంపిళ్ల వివరాలు, క్షయవ్యాధి (టిబి) రోగుల చికిత్సకు అందుబాటులో ఉన్న సదుపాయాలపై కూడా వివరంగా విచారణ చేశారు. ఈ సందర్భంగా అవసరమైన మౌలిక వసతులపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాలపై అధికారులు తక్షణమేనివేదికల రూపంలోప్రతిపాదనలు తమకార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. అంతేకాక ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ స్పష్టంగా సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శోభారాజు, డిప్యూటీ సివిల్ సర్జన్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి (ఇంచార్జీ) డాక్టర్ సునీత, జిల్లా ఆరోగ్య సేవల సమన్వయ అధికారిణి, ఏరియా హాస్పిటల్ మల్కాజిగిరి డాక్టర్ సంగీత్ తదితరులు పాల్గొన్నారు.



### డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానంటూ

# డబ్బు వసూళ్లు..,

## ఎమ్మెల్యే వివేకానంద్ మాజీ పిఏ హరిబాబు అరెస్ట్...,



**కుత్బుల్లాపూర్, జూలై 23, (తెలంగాణ దిశ):** డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానంటూ డబ్బు వసూళ్లు చేసిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ మాజీ పిఏ హరిబాబును జీడిమెట్ల పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో పని చేస్తూ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తానని పలువురిని మోసగించిన బొమ్మిడిశెట్టి హరిబాబును బాధితుల ఫిర్యాదు మేరకు అరెస్టు చేశారు. ఈ విషయమై బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి జీడిమెట్ల పోలీస్ స్టేషన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వివరించారు. కుత్బుల్లాపూర్ లో నివసించే బొమ్మిడిశెట్టి హరిబాబు గత పది సంవత్సరాలుగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వద్ద పీఏ గా పనిచేసేవాడు. అయితే ఎమ్మెల్యే వద్దకు వచ్చి వెళ్లే వాళ్ళతో పరిచయాలు ఏర్పడ్డాయి. దీంతో వారికి డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్స్ ఇప్పిస్తానంటూ పలువురికి ఆశ చూపి లక్షలాది రూపాయలు వసూళ్లు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. గిరి నగర్ కు చెందిన రమేష్ అనే వ్యక్తి ఫిర్యాదుతో జీడిమెట్ల పోలీసులు దర్యాప్తును చేపట్టారు. అనంతరం మల్లేశ్వరి అనే మహిళ కూడా హరిబాబు డబల్ బెడ్ రూమ్ ఇప్పిస్తానంటూ డబ్బు తీసుకున్నాడని పోలీసులను ఆశ్రయించింది. దీంతో జీడిమెట్ల పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇప్పటివరకు ఎనిమిది మంది బాధితులు పోలీసుల వద్ద ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ వసూళ్ల కార్యక్రమం 2023 సంవత్సరం నుంచి నిందితుడు ప్రారంభించినట్లు తెలిసింది. అయితే నిందితుడు హరిబాబు సుమారు 83 మంది వద్ద ఈ రకంగా డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్స్ ఇప్పిస్తానంటూ మోసగించినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. జీడిమెట్ల పోలీసులకు అందిన ఫిర్యాదుతో దర్యాప్తును ప్రారంభించగా నిందితుడు హరిబాబు డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్స్ ఇప్పిస్తానంటూ బాధితులను మోసగించినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. దీంతో నిందితుడు హరిబాబును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అయితే కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ఈ విషయమై ఒక పత్రిక ప్రకటనను విడుదల చేశారు. నిందితుడు హరిబాబు ఈ రకమైన అక్రమాలకు పాల్పడుతున్నాడని తెలియగానే అతనిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అయితే పోలీసులకు ఇంతవరకు ఎనిమిది మంది బాధితులు మాత్రమే తమ ఫిర్యాదులను అందించినట్లు తెలిసింది. బాధితులందరూ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఏసిపి ప్రజలను కోరారు. నిందితుడు హరిబాబు ఈ రకమైన అక్రమ వసూళ్లకు పాల్పడి వచ్చిన డబ్బుతో ఇల్లు నిర్మించుకుంటున్నట్లు తెలిసింది. ఇలా వచ్చిన ఫిర్యాదులపై కూడా దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టు నుండి కస్టడీకి తీసుకొని మరింత సమాచారాన్ని సేకరించనున్నట్లు పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో జీడిమెట్ల ఇన్ స్పెక్టర్ మల్లేష్, జీడిమెట్ల డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ కనకయ్య, సబ్ ఇన్ స్పెక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 200 కోట్ల ఉచిత ప్రయాణాలు..

## రూ. 6680 కోట్ల ఆదా...., ప్రజాపాలన ఘనత

### - మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి



**కుత్బుల్లాపూర్, జూలై 23, (తెలంగాణ దిశ) :**ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రికార్డు నమోదు చేయడం అభినందనీయమని మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ అన్నారు. తద్వారా మహిళలు ఉచిత ప్రయాణాలు చేసిరూ. 6680 కోట్ల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్నారని తెలిపారు. ఈనేపథ్యంలో మహాలక్ష్మి సంబరాలు జరపడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే పార్టీ అగ్రనేత సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా డిసెంబర్ 9వ తేదీన మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల పరిధిలో మహిళలు ఎక్కడ నుంచి ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. దీంతోపాటు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగాప్రభుత్వం కృషి చేస్తుందన్నారు ఇందులో భాగంగా ఆర్టీసీలో మహిళలకు బస్సులు కొనుగోలు చేసియజమానులను చేసిందన్నారు. అదేవిధంగా మహిళలకు పెట్రోల్ బంకులు మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో ఆర్టీసీని నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం చేసే క్రమంలో ప్రజా ప్ర భుత్వం ఆర్టీసీనిలాభాల బాటలోకి తీసుకువచ్చింద న్నారు. కొత్త బస్సులను కొనుగోలు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని ఆమె సూచించారు.

### గణనీయంగా పెరుగుతోన్న...

# ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం గణనీయంగా పెరుగుతోం ది. సులభంగా డ్రైవింగ్ చేసే వీలుండడంతో మహిళలు సైతం వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఎలక్ట్రిక్ ఆటో డ్రైవర్లుగా మహిళలు సైతం పని చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఒమేగా సెకిల మొబిలిటీ కంపెనీ మహిళల కోసం ప్రత్యేక ఆఫర్ తీసుకొచ్చింది. మహిళా డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా రూ పొందించిన పింక్ ఆటో రిక్షాలను చాలా తక్కువ ధరకే ఇస్తామని ప్రకటించింది. మహిళా డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా పింక్ ఆటో రిక్షాలను రూపొందిస్తున్నట్లు ఒమేగా సెకీ పేర్కొంది. దేశవ్యాప్తంగా మహిళా డ్రైవర్ల కోసం 2500 ఎలక్ట్రిక్ పింక్ ఆటో రిక్షాలను తక్కువ ధరలకే దశల వారీగా అందించనున్నట్లు తెలిపింది. తమ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఈ పథకాన్ని ఢిల్లీలో ప్రారంభించినట్లు ఒమేగా సెకి తెలిపింది. అలాగే మహిళలకు ప్రభుత్వ బ్యాంకు నుంచి వెహికల్ లోన్ తీసుకుంటే వడ్డీలోనూ 1శాతం రాయితీ సైతం లభిస్తుందని కంపెనీ తెలిపింది మహిళా డ్రైవర్లకు తక్కువ ధరకే ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలను అందించేం దుకు తాము ఢిల్లీకి చెందిన లాభాపేక్ష లేని నారీ శక్తి సంస్థతో కలిసి పని చేస్తున్నామని ఒమేగా సెకి వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఉదయ్ నారంగ్ తెలిపారు.
కొన్ని నెలల్లో ఈ పథకాన్ని బెంగళూరు, ఉత్తర కర్ణాటక, చెన్నైల్లోనూ అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే ఎంపిక చేసిన మహిళలకు డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇస్తామని, దీని ద్వారా మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పిస్తామని ఆయన తెలిపారు.

# దేశ వ్యాప్తంగా వేలాది 'జన ఔషధి' కేంద్రాలు




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఏ'దేశ ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన మెడిసిన్ అందివ్వాలి.. తద్వారా వారి ఆరోగ్య సంరక్షణకు భరోసా ఇవ్వాలి' అనే ధ్యేయంతో 2008లో కేంద్ర ప్రభు త్వం 'భారతీయ జన ఔషధి పరియోజన' పథకానికి శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా వేలాది 'జన ఔషధి' కేంద్రాలను ప్రారంభించింది. దేశవ్యా ప్తంగా కేంద్రాల సంఖ్య 15,057గా నమోదైంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఆ సంఖ్యను 25,000కు పెంచాలని కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేవలం 199 కేం ద్రా లు కేటాయించినప్పటి కీ, వాటికి వినియోగదారుల నుంచిమంచి ఆదరణ లభి స్తు న్నది. సంఖ్యాపరంగా మన రాష్ట్రం దేశం లో 19వ స్థానంలో నిలుస్తున్నది. కేం ద్రాల్లో లభించే జనరిక్ మెడిసిన్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నప్పటికీ, డిమాండ్‌కు తగిన విధంగా కేంద్రం రా ష్ట్రంలో కేంద్రాల సంఖ్యను పెంచడం లేదు. దేశవ్యాప్తంగా 15,057 జన్ ఔ షధి కేంద్రాల సంఖ్య ప్రకారం.. ప్రతి 10 లక్షల జనాభాకు 11 కేం ద్రాలు అందుబాటులో ఉన్నట్లు లెక్క. కానీ.. తెలంగాణకు కేటా యించిన 199 కేంద్రాల పరంగా చూస్తే.. ప్రతి 10లక్షల జనాభాకు కేవలం 2.4 కేం ద్రాలు ఉన్నట్లు తేలింది. రాష్ట్రంలో మరిన్ని కే ంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాం డ్ ప్రజల నుంచి వ్యక్తమవు తున్నది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏర్పా టు చేసిన జన ఔషధి కేంద్రాల్లో తెలంగాణ వాటా కేవలం 1శాతం అయినప్పటికీ.. ఆ కేంద్రాల్లో వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతుండడం విశే షం. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 1,427, గుజరాత్‌లో 943, మహా రాష్ట్రలో 784 కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. చివరి స్థానాల్లో మేఘాలయ, నాగాలా ండ్ రాష్ట్రాలు నిలిచాయి. ప్రస్తు తం మేఘాలయలో 47, నాగాలాండ్‌లో 46 కేంద్రాల ద్వారా వినియోగదా రులకు జనరిక్ మెడిసిన్ లభిస్తున్నది. దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడులో తమిళనా డులో 337, కర్ణాటక 473, ఆంధ్రప్రదేశ్ 276, తెలంగాణలో 199 జన ఔషధి కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. చివరి స్థానంలో కేరళ ఉంది. ఇక్కడ కేవలం 103 కేంద్రాలు మా త్రమే అందుబాటులో ఉన్నాయి. ఔష ధి కేంద్రాల్లో లభించే ఒక్కో జనరిక్ మెడిసిన్‌పై వినియోగదారులకు 50 శాతం నుంచి 90 శాతం రాయితీ లభిస్తుంది. ఇక్కడ లభించే మెడిసిన్ వందశాతం డబ్ల్యూహెచ్‌వో నిర్దేశించిన గుడ్ మాన్యుఫ్యా క్చరింగ్ (జీఎంపీ), భారత అక్రిడిటిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్) నాణ్యతా ప్రమాణాలతో తయారు చేసినవి కావ డంతో కేంద్రాలకు రోజురో జుకూ మెడిసి న్‌కు ఆదరణ పెరుగు తున్నది. ఈ కేంద్రలు ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తు న్నాయి. కేంద్రాలతో ఔత్సాహిక వ్యాపారులకు సైతం చేయూతనివ్వడం జన ఔషధి పథక లక్ష్యాల్లో ఒక లక్ష్యం.

# ఏపీలో ఉపాధి కల్పనపై దృష్టి..

**విజయవాడ, తెలంగాణ దిశ :** విజన్ ఉన్నవారికి దూరదృష్టి ఎక్కువ. భావితరాల గురించి ఆలోచన చేస్తారు. సమస్యలకు పరిష్కారం కనుగొంటారు. పనులు త్వరగా జరిగేలా చేస్తారు. వ్యయ ప్రయాసలు లేకుండా చూస్తారు. ఉపాధి కల్పనపై దృష్టి పెడతారు. విజన్ ఉంటే.. ఎంత కష్టమైన పని అయినా సులభం అవుతుంది. భావి సమస్యలను పరిష్కరిస్తుంది. ఆటంకాలను తొలగిస్తుంది. అవసరాలను తీరుస్తుంది. వ్యయ ప్రయాసలు లేకుండా చేస్తుంది. రాజకీయాల్లో మంచి విజన్ ఉన్న నేతగా ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు గుర్తింపు ఉంది. టెక్నాలజీని విరివిగా వినియోగించడంలో ఆయన దిట్ట. తెలంగాణ రాజధాని అభివృద్ధికి ఆయన విజనేకారణం. ఇప్పుడు ఏపీ సీఎంగా మరో సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ క్రమంలో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకురాబోతున్నారు. ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రారంభించబోతున్న వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం ఉండదు. ఇంట్లో నుంచే సేవలను పొందవచ్చు. డేట్ ఆఫ్ బర్త్, కులం, నివాసం, ఆదాయం వంటి 150 సర్వీస్‌లు ఆన్‌లైన్‌లో పొందవచ్చు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు తొలగించేందుకు ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నారు. సమయం వృథా కాకుండా ఉండడమే కాకుండా డబ్బులు ఆదా అవుతాయని అధికారులు పేర్కొంటున్నారుదేశంలో 64 లక్షల పెన్షన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

# విభజన సమస్యలపై అడుగులు..!

**హైదరాబాద్, తెలంగాణ దిశ :**2014లో ఉమ్మడి ఏపీ విడిపోయి.. రెండు రాష్ట్రాలు గా విడిపోయిన విషయం తెలిసిందే. అయితే.. ఆ తర్వాత.. కేం ద్రంలో ప్రభుత్వం మారడంతో.. విభజన చట్టంలోని చాలా సమ స్యలు అపరిష్కృ తంగానే ఉండి పోయాయి. అప్పటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా కేంద్రానికి పలు రూపాల్లో విన్నపాలు చేస్తూనే ఉన్నాయి. అయితే.. ఎట్టకేలకు.. తాజాగా కే ంద్ర హోంశాఖ ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టింది. ము ఖ్యంగా విభజన చట్టం-2014లో ని షెడ్యూల్ 9, 10లలోని స ంస్థలు, ఆస్తుల విభజనపై కేంద్రం దృష్టి పెట్టింది. అదేసమయంలో ఉమ్మడి ప్రాజెక్టుల పూర్తికి కూడా.. ప్రయ త్నాలు ప్రారంభించింది. దీంతో వడి వడిగానే ఈ సమస్యలు కొంతవ రకైనా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గత రెండుమాసాల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఆయా రాష్ట్రాల ప్రయోజనాలు పరిరక్షిస్తూనే.. విభజన చట్టంలోని అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారుఈ నేపథ్యంలో ఆయా సమస్యల పరిష్కారంపై దృష్టి పెడుతూ.. తాజాగా కేంద్ర హోం శాఖ నోట్ విడుదల చేసింది. షెడ్యూల్ 9లోని కార్పొరేషన్లు,కంపెనీల పంపకం అత్యంత కీలకంగా మారింది. అదేవిధంగా షెడ్యూల్ 10లోని సంస్థల విభజన(ఆర్టీసీ సహా ఇతర సంస్థలు)ను వేగంగా చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే.. రెండు రాష్ట్రా ల్లో చేపట్టిన వివిధ మౌలిక సదుపాయాలు, విద్యా సంస్థల ప్రాజెక్టుల పురోగతిని కూడా కేంద్రం పరిశీలిస్తోంది.
అదేవిధంగా వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే నిధుల విషయంపైనా కేంద్రంక్లారిటీ ఇచ్చేప్రయత్నం చేస్తోంది. ఈక్రమంలో ఏపీకి 350 కోట్లు,తెలంగాణకు 270 కోట్ల రూపాయలను ఇవ్వనుంది. దుగ్గరాజపట్నం వద్ద పోర్టు నిర్మాణానికి, కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కూడా త్వరలోనే మార్గం సుగమం కానుందని అధికార వర్గాలు చెబుతు న్నారు. సో..ఎలా చూసుకున్నా.. సుదీర్ఘ విరామంతర్వాత.. రెండు రాష్ట్రాల విభజన చట్టంలోని అపరిష్కృ తంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం రెడీ అయింది.

# అమెరికా, చైనా ఉమ్మడి పోరు..!



బీజింగ్: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరింది. అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ తాను ప్రకటించిన ప్రతీకార సుంకాల అమలును 90 రోజులపాటు నిలుపుదల చేసినా.. చైనాకు మాత్రం ఆ ఊరటనివ్వలేదన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం కూడా మరో 20 శాతం అదనపు సుంకాలు వేసి మొత్తం డ్రాగన్‌పై 145 శాతానికి చేర్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం చైనా కూడా దీటుగా స్పందించింది. తమ దేశంలోకి వచ్చే అమెరికా వస్తూత్ప త్తులపై మరో 41 శాతం టారిఫ్‌లు పడుతాయని స్పష్టం చేసింది. దీంతో అమెరికాపై చైనా అదనపు సుంకాల భారం 84 శాతం నుంచి 125 శాతానికి పెరిగిపోయింది. పెంపు అమల్లోకి రానున్నది. కాగా, పరస్పర సుంకాలపై అమెరికాతో చర్చలకు సిద్ధమని చెప్తూనే.. బెదిరిం పులకు పాల్పడితే ఊరుకోబోమని చైనా హెచ్చరిస్తున్నది. ఇందుకు తగ్గట్టుగా ంట్రంప్ దూకుడుకు తగ్గట్టుగా జిన్‌పిన్ సర్కారు ముందుకెళ్తున్నది చూస్తూనే ఉన్నాం. ఇక అమెరికా టారిఫ్‌ల పెంపు అంశాన్ని ప్రపంచ ఆర్థిక చరిత్రలో ఓపెద్ద జోక్‌గా చైనా కస్టమ్స్ టారిఫ్ కమిషన్ అభివర్ణించింది. అంతేగాక 125 శాతం సుంకాల భారం వల్ల చైనాలో అమెరికా వస్తూత్పత్తులకు ఇక గిరాకీ ఉండబోదని, కాబట్టి మళ్లీ చైనాపై ట్రంప్ సుంకాలను పెంచినా.. దానికి మేమేమీ స్పందించబోమని కమిషన్ చెప్పింది. అయితే అమెరికా టారిఫ్‌లపై చివరిదాకా పోరాడుతామని పునరుద్ఘాటించింది.

**ఈయూతో కలిసి ఉమ్మడి పోరు:**

అమెరికా ప్రతీకార సుంకాలపై ఆయా దేశాల మద్దతు కూడగట్టే పనిలో బిజిబిజీగా ఉన్న చైనా.. యూరోపియన్ యూనియన్ (ఈ యూ) పైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నది. ఈయూ కూటమిలో చాలా దేశాలు ఉండటం, ట్రంప్ ఎక్కువగా టారిఫ్‌లు వేసిన దేశాల జాబితాలో అవీ భాగం కావడంతో ఆ వైపు నుంచి డ్రాగన్ పావులు కదుపుతున్నది. ఇందులో భాగంగానే తాజాగా చైనా అధ్యక్షుడు జీజిన్‌పిన్.. ఈ టారిఫ్ వార్‌పై ఉమ్మడి పోరుకు పిలుపునిచ్చారు.
అందులో భాగం కావాలని ఈయూను కోరారు. ఇక ఈ వాణిజ్య యుద్ధంలో ఎవరూ విజేత కాలేరన్న ఆయన ప్రపంచంపై ఈ తరహా విధానాలను అనుసరిస్తే ఒంటరిగా మిగిలిపోతారని ట్రంప్‌ను హెచ్చరించారు. ఇప్పటికే అమెరికా తీరుపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చైనా ఫిర్యాదు చేసిన సంగతి విదితమే.

**టారిఫ్‌లకు బ్రేక్.. భారత్ ఏంచేయాలి?:** భారత్-అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అమలుకు చర్చలను వేగవంతం చేయాలని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) అధ్యక్షుడు ఎస్‌సీ రల్హన్ సూచించారు. చైనాపై అధిక టారిఫ్‌ల నేపథ్యంలో అక్కడి ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలను ఆకర్షించి ఆ పెట్టుబడులు భారత్‌కు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) చైర్మన్ పంకజ్ మహింద్రూ సలహా ఇచ్చారు. అల్యూమినియం ఉత్పత్తులపై అమెరికా ఈ ఏడాది మార్చిలోనే 25 శాతం అదనపు సుంకాలను వేసిందని, దీంతో టారిఫ్‌ల వాయిదా వల్ల తమకేమీ ఊరట దక్కలేదని భారతీయ మినరల్ ఇండస్ట్రీస్ సమాఖ్య అదనపు ప్రధాన కార్యదర్శి బీకే భాటియా అంటున్నారు. కాబట్టి అమెరికాతో చర్చల సందర్భంగా పరిశ్రమపైనా భారం తప్పేలా కృషి చేయాలని మోదీ సర్కారును కోరుతున్నారు.
టారిఫ్‌లు వాయిదాప డ్డప్పటికీ అమెరికాపై ఎక్కువగా ఆధారపడకపోవడమే భారత్‌కుమంచి దని, కనుక ఇతర దేశాల మార్కెట్లపై దృష్టిసారించి అక్కడిఎగుమతులు పెరిగేలా చూసుకోవాలని కేంద్రానికి ఈవై ఇండియాట్యాక్స్ పార్ట్‌నర్ బిపిన్ సప్రా సూచించారు. అమెరికాలో చైనా దిగుమతులపై 145 శాతానికి టారిఫ్‌లు చేరడంతో అక్కడ భారతీయ ఉత్పత్తులకు మరింత గిరాకీ పెరగవచ్చని గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనా వేస్తున్నది. ఈ పరిస్థితిని అందిపుచ్చుకుంటే భారత్‌కు ఎ గుమతుల పరంగా లాభిస్తుందంటున్నది.

## స్విస్ లో బురఖా బ్యాన్..


న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌లో బహిరంగ ప్రదేశాల్లో బురఖా ధరించడంపై నిషేధం అమల్లోకి వచ్చింది. ప్రజలు తిరిగే ప్రైవేట్ భవనాల్లో కూడా బురఖా నిషేధించబడుతుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి 1,000 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 96,947) జరిమానా విధించబడుతుంది. ఈ నిర్ణయాన్నిముస్లిం సంస్థలు,హక్కుల కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021లో జరిగిన దేశవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణలో, 51 శాతం మంది బురఖా నిషేధానికి అనుకూలంగా ఓటు వేశారు. ఈ నిర్ణయాన్ని అక్కడి పార్లమెంట్ కూడా ఆమోదించింది. దాదాపు 8.85 మిలియన్ల జనాభా కలిగిన స్విట్జర్లాండ్‌లో, ముస్లింలు 5 శాతం ఉన్నారు. ఈ కొత్త చట్టం ప్రకారం, బహిరంగ ప్రదేశాల్లో ముఖాన్ని కప్పి ఉంచడం నిషేధించబడింది, ఈ నిబంధనను ఉల్లంఘిస్తే వెయ్యి స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ. 96 వేలు) జరిమానా విధించబడుతుంది. స్విట్జర్లాండ్‌లో 2021ప్రజాభిప్రాయ సేకరణలో ఆమోదించబడిన ఈ నిషేధాన్ని ముస్లిం సంస్థలు విమర్శించాయి. విశేషమేమిటంటే, 2009లో దేశంలో కొత్త మినార్ల నిర్మాణాన్ని నిషేధించిన గ్రూపునే బురఖాపై నిషేధం విధించింది. 2021లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో స్విట్జర్లాండ్‌లో 51.21 శాతం మంది ప్రజలు ఈ నిషేధానికి మద్దతుగా ఓటు వేశారు. మితవాద స్విస్ పీపుల్స్ పార్టీ దేశంలో బురఖా నిషేధాన్ని ప్రతిపాదించింది, ఇది దేశ సాంస్కృతిక విలువలు, ప్రజా భద్రతను కాపాడుతుందని వాదించింది. దీని తరువాత, 2022 సంవత్సరంలో దేశ జాతీయ కౌన్సిల్ ఈ చట్టాన్ని ఆమోదించింది. దీని ప్రకారం, బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, దుకాణాలు, రెస్టారెంట్లలో మహిళలు తమ ముఖాలను పూర్తిగా కప్పి ఉంచడం నిషేధించబడింది. బురఖా నిషేధానికి సంబంధించి స్విస్ ప్రభుత్వం విమానాల్లో లేదా దౌత్య, కాన్సులర్ ప్రాంగణాల్లో బురఖా నిషేధం వర్తించదని స్పష్టం చేసింది. ఇదికాకుండా,మతపరమైన ప్రదేశాలు, ఇతరపవిత్ర ప్రదేశాలలో ఒక వ్యక్తి తనముఖాన్ని కప్పుకోవడానికి కూడా అనుమతించబడతా రు. ఆరోగ్యం,భద్రతా కారణాలు,సాంప్రదాయ ఆచారాలు లేదా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఫేస్ కవర్లు అనుమతించబడతాయని ప్రభుత్వం తెలిపింది. కళాత్మకలేదా వినోద కారణాలతో పాటు ప్రకట నల ప్రయోజనాల కోసం వారికి ఈ ఆమోదం మంజూరు చేసింది. 2022లో కొంతమంది ముస్లిం మహిళలు ధరించే బురఖా వంటి ముఖ కవచాలను నిషేధించాలని స్విట్జర్లాండ్ పార్లమెంటు దిగువ సభ ఓటు వేసింది. జాతీయ కౌన్సిల్ ఈ చట్టానికి వ్యతిరేకంగా 29 ఓట్లతో పోలిస్తే 151ఓట్లతో ఆమోదించింది. అనేక ముస్లిం సంస్థల అభ్యంతరాలు ఉన్నప్పటికీ రైట్-వింగ్ స్విస్ పీపుల్స్ పార్టీ ఈ చట్టం కోసం ముందుకు వచ్చింది. ఇలా చేయడంలో స్విట్జర్లాండ్ మొదటి దేశం కాదు, ఐరోపాలోని బెల్జియం, డెన్మార్క్, ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ఇలాంటి ఆంక్షలు విధించాయి. అయితే,యూరోపియన్ దేశాలలో మత స్వేచ్ఛకు సంబంధించి చాలాసార్లు ప్రశ్నలు తలెత్తాయి. ప్రజా భద్రత పేరుతో చేసిన ఈ చట్టాల ద్వారా ముస్లిం మహిళలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు.

# టెక్నాలజీ బంధాలను దూరం చేస్తోందా..?

టెక్నాలజీ బంధాలను బలోపేతం చేస్తోందా, మనుషులను దూరం చేస్తోందా అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. ఆధునిక టెక్నాలజీ ప్రపంచాన్ని అరచేతిలో పెట్టేస్తోంది. కానీ, మన చిన్న ప్రపంచాన్ని మాత్రం కొన్ని మైళ్ల దూరానికి తీసుకుపోతోంది. మునపటి తరానికి ప్రస్తుత తరానికి ఆలోచనలు, ఆచరణలో చాలా తేడా వుంది. దీనికి ప్రధాన కారణం టెక్నాలజీ అని చెప్పవచ్చు. తరానికి తరానికి మధ్య ఈ తేడా ఉండటం సహజమే కానీ. కానీ ఈ సహస్రాబ్ది జనరేషన్ స్పీడ్ మామూలుగా లేదు. పాతిక, ముప్పయ్ ఏళ్ల క్రితం మొబైల్ ఫోన్లు లేవు, స్కూలు, కాలేజీ నుంచి ఇంటికి వచ్చి అమ్మా నాన్నలతోనే గడిపేవారు. ఇప్పటిలా ఇంట్లో వేర్వేరు గదులు లేవు. హాల్‌లోనే చదువులు ఉండేవి. పిల్లలు రహస్యంగా ఏ పని చేయాలన్నా కష్టంగానే ఉండేది. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దవాళ్లు ఓ కంట కనిపెట్టేవారు. పిల్లలు తల్లిదండ్రుల మాటకు చాలా విలువ ఇచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు, 13,14 ఏళ్లకే పిల్లల చేతికి మొబైల్ ఫోన్ వస్తోంది. స్కూలులో పాఠాలు నేర్చుకోవడానికి, రీసెర్చ్‌కి మొబైల్ ఫోన్ లేకపోతే ఎలా అని అడగడంతో, తోటి పిల్లల దగ్గర ఎక్కడ తక్కువైపోతారో, చదువులో ఎక్కడ వెనకబడిపోతారో అనే భయంతో తల్లిదండ్రులు పిల్లల చేతిలో స్మార్ట్ ఫోన్ పెట్టక తప్పట్లేదు. మొబైల్ చేతిలోకొచ్చాక వాళ్ల స్నేహాలు ఎవరితో ఎలా ఉంటున్నాయో అంచనా వేయలేరు.

సైబర్ నేరాలు, సైబర్ మోసాలు, ఆడపిల్లలను మోసం చేయడం, అపరిచితులతో స్నేహాలు, డేటింగ్ ఇవన్నీ మొబైల్ ఫోన్ల వల్ల పెరుగుతున్నాయి. టెక్నాలజీ చేతుల్లోకి రాగానే, ప్రపంచం చేతుల్లోకి వచ్చేసింది. గత తరంలో పిల్లలు తమకు తెలియని విషయాల గురించి పెద్దవాళ్లను ప్రశ్నలు అడిగేవారు. ఇప్పుడు గూగుల్ తల్లిని అడుగుతున్నారు. ఫోన్లు, టీవీలు పిల్లలకు ఫ్రెండ్స్‌గా మారిపోయాయి.

ఇంటికి చుట్టాలు, స్నేహితులు వస్తే, వాళ్లతో గడపడానికి, కనీసం ఐదు నిమిషాలు పలకరించేందుకు కూడా ఈ తరం పిల్లలకు ఓపిక ఉండటం లేదు. అవతలి వ్యక్తులు మాట్లాడుతుంటే, వీళ్లు ఫోన్లు చూసుకుంటూ, ఇంటికొచ్చిన వారి పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది పేరెంట్స్ పెంపకం తప్పో, టెక్నాలజీ తప్పో అర్థం కాని పరిస్థితి.



ఇక,ఇంట్లో అందరూ కలిసి భోజనం చేసే సంస్కృతి ఎప్పుడో పోయింది. దీంతో, కుటుంబ సభ్యుల మధ్య మాటలే కరువయ్యాయి. డబ్బులు కావాలంటే మాత్రం ప్రేమగా ఓ ఐదు నిమిషాలు మాట్లాడతా రు. ప్రతిబంధాన్నీ ఓ డీల్‌లా చూడటం అలవాటైపోయింది. మానవ సంబంధాలు యాంత్రికంగా మారిపోయాయి.


అసాధారణ ప్రవర్తనను ఈ జనరేషన్ సాధారణం చేశారు. ఐతే, ఈ తరం వారు దీర్ఘ కాలంలో ఒత్తిడికి, అసహనానికి లోనయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నా యి. క్షణకాలపు ఆకర్షణలో ఏర్పడే పరిచయాలకు శాశ్వతత్వం ఉండదు. ఆన్‌లైన్ చాట్‌లు, కొన్ని రోజులు గడిపిన తర్వాత గొడవలు సాధారణం అయ్యాయి. సైబర్ సైకాలజీ, బిహేవియర్ అండ్ సోషల్ నెట్ వర్కింగ్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో ఆన్‌లైన్‌లో కలిసిన జంటల సంబంధాలు

ఆఫ్‌లైన్‌లో కలిసిన వారి కంటే భిన్నంగా ఎలా ఉంటాయనే అంశాలను పరిశీలిం చింది. ఈ అధ్యయనంలో ఆన్‌లైన్ డేటింగ్‌లో ఏర్పడే సంబంధాలు విఫలమవుతాయని, బలహీనంగా ఉంటాయని చెప్పడం తప్పు అని అధ్యయనకారులు పేర్కొన్నారు.

నేటి యువత సంబం ధాలను ఏర్పరచుకోవడంలో, నిర్వహించడంలో టెక్నాల జీ కీలకమైన మార్పులు తీసుకువచ్చింది. ఫేస్‌బుక్,ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లాంటి సోషల్ మీడియా ఫారాలు వాట్సాప్, సిగ్నల్ లాంటి మెసేజింగ్ అప్లికేషన్లు తక్షణ కనెక్టివిటీని అందిస్తున్నాయి.



# ఆధ్యాత్మిక చింతనతో బాహ్య ప్రపంచాన్ని చూస్తూ.. ప్రకృతి ఒడిలో హాయిగా



అదో కుగ్రామం.. అక్కడ కరెంటు లేదు. టీవీలు లేవు, సెల్‌ఫోన్‌లు లేవు. ప్రస్తుత సమాజాన్ని కుంగదీసే లక్షణాలేవీ అక్కడ కనిపించవు. ప్రజలంతా ఆధ్యాత్మిక చింతనతో బాహ్య ప్రపంచాన్ని చూస్తూ ప్రకృతి ఒడిలో హాయిగా జీవించేవారు. ఉన్నత చదువులు, పెద్ద ఉద్యోగాలతో సంపన్న జీవితాన్ని అనుభవించినా.. జీవిత పరమార్థం ఇదేనని భావించే వారంతా.. 'అభివృద్ధి పథం'గా అన్వేషణలో భాగంగా కొత్త జీవన విధానాన్ని అనుసరిస్తున్నారు. 'పరమాత్మకు చేరువయ్యే వికాసమార్గం.. సనాతన ధార్మిక జీవనం'గా భావించి సరికొత్త జీవన విధానాన్ని అనుసరిస్తున్నారు. కాలం మారుతున్న కొద్దీ అలవాట్లు, పద్ధతులు మారుతున్నాయి. కాలం మనుషులను అలా ముందుకు నడిపిస్తుంది. కానీ శ్రీకాకుళం జిల్లాలోని కుర్మ గ్రామ ప్రజలు మాత్రం అందుకు భిన్నమైన మార్గాన్ని అనుసరిస్తూ, కాలానికి వ్యతిరేకంగా నిలబడి, పూర్తిగా పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాలో ఒక గ్రామం ఉంది, ఇక్కడ ప్రజలు సంవత్సరాలుగా వైదిక సంప్రదాయం ప్రకారం జీవిస్తున్నారు. ప్రకృతి ఒడిలో ఉన్న ఈ గ్రామం పేరు కూర్మ గ్రామం . ఇక్కడి ప్రజల జీవన విధానం ఇప్పటికీ సంప్రదాయంగానే ఉంది. ఇక్కడి ప్రజలు గురుకుల సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. గ్రామస్తులు కూడా పాత పద్ధతుల్లోనే వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయానికి యంత్రాలు, రసాయనాలు ఉపయోగించరు. కూర్మ గ్రామ ప్రజలు ఆధునికతకు దూరంగా ఉన్నారు. గ్రామంలో మట్టి, ఇసుక, సున్నంతో చేసిన ఇళ్లు కనిపిస్తాయి. ఇల్లు కట్టుకోవడానికి ఇసుకలో నిమ్మ, బెల్లం, ఇతర వస్తువులను కలుపుతామని ప్రజలు అంటున్నారు. వాటి సహాయంతో గోడలు కలుపుతారు.

ఇళ్ల నిర్మాణానికి సిమెంటు, ఇనుము ఉపయోగించరు.
ఈ గ్రామంలో మొత్తం 56 మంది నివసిస్తున్నారు. గ్రామంలోని ప్రజలు ఏళ్ల తరబడి వైదిక సంప్రదాయం ప్రకారం జీవిస్తున్నారు. ఊరిలో వేదాలు నేర్పే ఒక గురువు ఉన్నాడు. గ్రామంలోనే బట్టలు నేసేవారూ, కుట్టేవారూ ఉన్నారు. గ్రామంలో ఒక వడ్రంగి కూడా ఉన్నాడు. ఇక్కడ నల్ల బియ్యం, ఎర్ర బియ్యం సాగు చేస్తారు. బట్టలు ఉతకడానికి డిటర్జెంట్ కూడా ఉపయోగించరు. ఇక్కడి ప్రజలు సహజమైన కుంకుడు కాయ రసంతో బట్టలు ఉతుకుతారు.

2018లో ఇంటర్నేషనల్ కృష్ణ కాన్షియస్‌నెస్ సొసైటీ వ్యవస్థాపకుడు భక్తి వేదాంత స్వామి ప్రభుపాద, అతని శిష్యులు ఇక్కడ తమ గుడిసెను స్థాపించారు. సాయంత్రం వారిచే ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రామాయణం, వేదాలు, పురాణాలు, ఇతర హిందూ గ్రంథాల గురించి ప్రజలకు సమాచారం ఇవ్వబడుతుంది.

ఇక్కడి విద్యార్థులు తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రావీణ్యం కలిగి ఉన్నారు. గ్రామంలో కరెంటు లేదు. ప్రజలు ఫ్యాన్లు, టీవీలు, ఫోన్లు ఉపయోగించరు.

గ్రామంలో నివసించడానికి నియమాలు ఏమిటి : ఈ గ్రామంలో వసతి, భోజనం ఉచితం. ఇక్కడ నివసించాలనుకునే వారు ఇక్కడి నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. మహిళలు ఒంటరిగా జీవించడానికి వీలు లేదు. వారు తమ తండ్రి, భర్త లేదా సోదరులతో వచ్చినట్లయితే, వారు ఉండడానికి అనుమతిస్తారు. ఆశ్రమంలో ఉన్నంత కాలం తెల్లవారుజామున 3.30 గంటలకు నిద్రలేచి దైవ పూజ చేయాలి. ఉదయం భజన, ప్రసాదం తీసుకున్న తర్వాత తమ రోజువారీ పనులు ప్రారంభిస్తారు.



# 'పని-జీవితం' మధ్య... అసమతుల్యత



'ఎక్కడమ్మా నువ్వు లేనిది / ఏమిటీ నువ్ చేయలేనిదీ వ్యవసాయంలో నువు లేకుంటే/ నోటికాడికి కూడే రాదు/ సమాజ గమనం నువు లేకుంటే గతితప్పి గంగపాలవుతుంది' అంటారు కవి దేవేంద్ర. భూస్వామ్య సమాజం స్త్రీని సొంత ఆస్తిగా, వంటింటికే పరిమితంజేసి, జీతంలేని పనిమనిషిగా చేస్తే పెట్టుబడిదారీ విధానం స్త్రీ ఉనికినే సరుకుగా మార్చింది. దేశ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగడంతో పాటు వారి 'పని-జీవితం' మధ్య అసమతుల్యత కూడా అంతే వేగంగా పెరుగుతోంది. స్త్రీ పురుషులిద్దరూ ఒకేలాంటి ఉద్యోగం చేస్తున్నా ఇంటా బయటా పురుషుని ఉద్యోగానికి, ప్రమోషన్‌కు వున్న ప్రాధాన్యత స్త్రీకి వుండదు. 'ఆర్థిక స్వేచ్ఛ, ఆత్మగౌరవం, స్వంత ఆలోచన, స్వయం నిర్ణయ శక్తి, స్త్రీల ప్రగతికి దోహదం చేస్తాయ'ని యునెస్కో-2002లో ప్రచురించిన 'జెండర్ సెన్సిటివిటీ-ఎ ట్రైనింగ్ మాన్యువల్' నివేదిస్తోంది. కానీ, ఆచరణలో స్త్రీ జీవితం- శ్రమ మధ్య సమతుల్యతలో తీవ్రమైన అంతరం వుంది. ఈ తరం పురుషులు కొందరు ఇంటిపనిలో భార్యకు కొంత సాయం చేసినా, ముఖ్యమైన నిర్ణయాల్లో పురుషులదే పైచేయి. భార్య సంపాదన మీద నియంత్రణ కూడా పురుషులదే. స్త్రీలను పురుషులతో సమానంగా గుర్తించాలని, మానవ సంబంధాలలో మౌలికమైన మార్పులు రావాలని చెబుతూ 'లింగభేదం లేకుండా కుటుంబ సభ్యుల మధ్య ఇంటి పనిని సక్రమంగా పంచుకోవడంపై దృష్టి పెట్టండి' అంటారు అక్సోన్ కూల్.

భారత్‌లో ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య పెరుగుతోంది. అయితే, పని ప్రదేశంలో ఎంత ఒత్తిడికి గురవుతున్నా, ఇంటి పనిలో ఎలాంటి మినహాయింపు వుండదు. 'ఇంటెడు చాకిరి చేస్తూ/ పిల్లపాపలను కని పెంచుతూ/ ఉద్యోగము చేసి సంపాదిస్తూ/ జీతమంతా భర్త చేతిలో గుమ్మరించి/ బస్సు చార్జీలకై భర్త ముందు/ చేయి చాచి అర్థించిన నాడు-/ సిగ్గుతో ముడుచుకున్న చిరునవ్వును నేను' అంటారు డాక్టర్ వాసా ప్రభావతి. మహిళలు ఉద్యోగం చేయడానికి అంగీకరిస్తున్నప్పటికీ ఇంటి పనిభారం, పిల్లల సంరక్షణ బాధ్యతలను పంచుకోడానికి సగటు భారతీయ కుటుంబాల్లోని పురుషులు సిద్ధపడటంలేదు. ఉద్యోగులైన స్త్రీలు 5.8 గంటల సమయం ఇంటి పని చేయడానికి వెచ్చిస్తుండగా, నిరుద్యోగులైన పురుషులు 3.5 గంటలు, ఉద్యోగులైన పురుషులు 2.7 గంటలు మాత్రమే ఇంటి పని చేస్తున్నారని 'డేటా పాయింట్' ప్రచురించింది. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ 15-59 సంవత్సరాల వయసు గల స్త్రీ పురుషుల్లో 85 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు ఇంటి పనుల్లో నిమగ్నమై వుంటున్నారని లెక్కలు చెబుతున్నాయి. ఆడిటింగ్, ఐటీ, మీడియా వంటి రంగాల్లో వున్న మహిళలు వారానికి 55 గంటల కంటే ఎక్కువ సమయం పని చేస్తున్నారు. ఇది వారంలో ఆరు లేదా ఐదు రోజుల పనిని బట్టి ప్రతి రోజూ 9-11 గంటలు పని చేస్తున్నారని అంచనా. సగటు స్త్రీకి శ్రమ-జీవితం మధ్య సమన్వయం కుదరడం లేదు. 'సమస్యంతా అమ్మనుఅమ్మలా,మనిషిలా ఎలా చూడాలన్నదే/నేను అమ్మనో బొమ్మనో కాకుండా/ మనిషిగా ఎలా నిలబడాలన్న దే!!' అంటారు. సమాజంలో శ్రామిక బానిసయ్యిందో, మనిషిగా ఎందుకు కాకుండా పోయిందోనని ఆవేదన వ్యక్తం చేస్తారు కవయిత్రి శోభారాణి.ఒక సర్వే ప్రకారం స్త్రీలలో 81.2శాతం మంది వేతనంలేని గృహ సేవలలో నిమగ్నమై వున్నారు. గృహ నిర్వహణ, పిల్లలు, అనారోగ్యం, వృద్ధుల సంరక్షణ కోసం పురుషుల కంటే పదిరెట్లు ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తున్నారని ఆ సర్వే తేల్చింది. 'మహిళలంద రూ పని చేస్తారు,కానీ వారందరికీ జీతం లేదు' అంటారు నోబెల్‌ప్రైజ్ గ్రహీత, ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్. శ్రమ, జీవితంఈ రెండిటి మధ్య సమతుల్యత సాధించడంలో మహిళలకు అనేక కష్టాలు ఎదురవుతున్నాయి. 'స్త్రీ, పురుషులలో వర్క్-లైఫ్ బ్యాలెన్స్ సాధించాల ంటే ఇంటి పని విషయంలో పురుషుడు తప్పక సాయపడాలి. ప్రస్తుతం వర్క్ కల్చర్ మారిపోయిన నేపథ్యంలో ఇంటి నుంచి కూడా స్త్రీకి పూర్తి స్వేచ్ఛ లభించాలి' అని ఐఐఎం-అహ్మదాబాద్ ప్రొఫెసర్ సతీశ్ దియోధర్ నివేదిక వెల్లడించింది. స్త్రీల ఆరోగ్యం, వారి ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఆయా సంస్థలు, ప్రభుత్వాలు కొన్ని నిబంధనలను సడలించాలి. ముఖ్యంగా కుటుంబం వారికి బాసటగా నిలవాలి. అప్పుడే సమతుల్యత సాకారమౌతుంది.

## పురపాలిక స్థలం కబ్జా

# షెడ్లు వేసిన వైకాపా కౌన్సిలర్లు

**పెనుకొండ, తెలంగాణ దిశ :**వైకాపా కౌన్సిలర్లు, నాయకులు 36సెంట్ల ప్రభుత్వ స్థలం కాజేసేందుకు వేసిన షెడ్లను తొలగించకుండా అధికారులు పాలకులు చోద్యం చూస్తున్నారు. పెనుకొండ నగరపంచయాతీ పరిధిలోని 2వ వార్డులోని తిమ్మాపురంలో ఇందిరమ్మ కాలనీకి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంపై కన్నేసిన కౌన్సిలర్లు, నాడు అధికారం అండతో దాదాపు రూ. 3. 6కోట్లు విలువ చేసే 36సెంట్ల స్థలం కాజేసేందుకు 24షెడ్లు జనవరిలో నిర్మించేందకు సిద్ధమయ్యారు. వెంటనే 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించడంతో షెడ్ల నిర్మాణ పనులు నిలిపేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాటిని ఆ తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలు గడుస్తున్నా అక్రమంగా వేసిన షెడ్లు తొలగించకపోవడం శోచనీయం. నగరపంచాయతీ ఆదాయానికి అడ్డంకిగా ఉన్న షెడ్లను తొలగించి, పంచాయతీకి ఆదాయ వనరుగా మార్చడంతో పాటు పది మంది చిరువ్యాపారులకు ఉపాధి కల్పించే విధంగా వ్యాపార సముదాయం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈషెడ్ల నిర్మాణం కారణంగా ఇందిరమ్మకాలనీలోని 175 నివాస గృహాల నుంచి వచ్చే వృథా నీరు వెళ్లే కల్వర్టు మేసివేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగు



నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటుచేసిన షెడ్లను తొలగించి కాలనీలోని మురుగు నీరు కల్వర్టు ద్వారా బయటకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. షెడ్ల నిర్మాణానికి సంబంధించి పూర్తి పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలం ఏ శాఖ పరిధిలో ఉందో తెలుసుకుని, ప్రభుత్వ స్థలానికి రక్షణ కల్పిస్తాం. అనుమతుల్లేకుండా వేసిన షెడ్లను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. కాలనీలో మురుగు సమస్యను పరిష్కరింస్తాం.

# పేరుకే మార్కెట్ యార్డులు!



**కదిరి, తెలంగాణ దిశ :**కొత్తచెరువులో 15 ఎకరాల విస్తీర్ణంలో యార్డు ఉంది. గోదాములు నిర్మించారు. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ఊసే లేదు. ప్రతి బుధవారం జీవాల సంత నిర్వహిస్తున్నారు. ఏటా రూ. 60 లక్షల ఆదాయం వస్తోంది. ఆదాయం సిబ్బంది జీతాలకే అన్నట్లు మారింది. రైతులు పండించిన ఉత్పత్తులను ఆరబెట్టడం, నిల్వ చేసుకోవటం, గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు మార్కెట్ యార్డులను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణకు సిబ్బందిని నియమించారు. లక్ష్యానికి అనుగుణంగా యార్డులకు వ్యవసాయ ఉత్పత్తులు రావటం లేదు. దీంతో కేవలం జీవాల క్రయవిక్రయాల నిర్వహణ మాత్రమే సాగుతోంది. వారానికి ఒకరోజు జరిగే సంతలతో ఆదాయం వస్తున్నా నిర్వహణ, సిబ్బంది జీతాలకే యార్డులన్న భావన వ్యక్తమవుతోంది. రైతుల్లో చాలా మంది ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు వ్యయప్రయాసలతో కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు.

గిట్టుబాటు ధర లభించక, తూకాల్లోనూ మోసపోతున్నారు. కదిరి మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగడం లేదు. డివిజన్ పరిధిలో వేరుసెనగతో పాటు ఇతర పంటలను పండిస్తున్నారు. చింతపండు వ్యాపారం బాగా జరుగుతుంది. ఆ ఉత్పత్తులు యార్డుకు వస్తున్న దాఖలాలు లేవు. ప్రతి మంగళవారం గొర్రెలు, మేకల సంత మాత్రమే నిర్వహిస్తున్నారు. ఏటా రూ. 84 లక్షల ఆదాయం సమకూరుతోంది.

యార్డు అందుబాటులో ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగంలో లేదు. రైతులు పండించిన పంటలను మార్కెట్‌యార్డులకు తెచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి కలిగిన రైతులు యార్డుల్లోని గోదాముల్లో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చు. ఈ ఏడాది నుంచి వేరుసెనగ విక్రయాలను మార్కెట్ యార్డులలో క్రయవిక్రయాలు సాగేలా చర్యలు తీసుకుంటాం. హిందూపురం, కదిరిలలో మిరప, చింతపండు, ధర్మవరంలో వేరుసెనగ క్రయవిక్రయాలు సాగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

# ఐదేళ్లలో తాగునీటి పథకాలన్నీ నిర్వీర్యం

### - ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, తెలంగాణ దిశ :** ఐదేళ్లల్లో వైకాపా ప్రభుత్వం పీఏబీఆర్ వద్ద ఉన్న తాగునీటి పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. నీటి పథకాల విషయంలో దుర్మార్గాన్ని ప్రదర్శించిందన్నారు. ఆయన కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద శ్రీరామరెడ్డి, కూడేరు, ఉరవకొండ తాగునీటి పథకాలను జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఉరవకొండ మండలం ఇంద్రావతి హంద్రీనీవా కాలువ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండ తాగునీటి పథకానికి సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల నుంచి నీరు సరఫరా అవుతోందన్నారు. సత్యసాయి పథకంలో రెండు మోటార్లకు ఒకటి, శ్రీరామరెడ్డి పథకంలో రెండు మోటార్లకు గాను రెండు పని చేయడం లేదన్నారు. కూడేరు పథకంలోని మోటారు ద్వారా నీటిని అందిస్తున్నారన్నారు. వీటితో పాటు కొంత మేర పైపులైన్లు, రాపిడ్ శాండ్ ఫిల్టర్‌లో ఇసుక పాడయ్యిందన్నారు. విద్యుత్తు నియంత్రికలు, మోటార్ల వద్ద విద్యుత్తు పరికరాలను, శుద్ధి జరిగిన నీటిని తోడే ప్రదేశంలో 1000 హెచ్‌పీ మోటార్‌ను, ఫిల్టర్ బెడ్‌లను మార్చాల్సి ఉందన్నారు. ఉరవకొండకు ఐదేళ్లుగా కలుషిత నీటినే సరఫరా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మోటార్లను మార్చడంతో పాటు, ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభిస్తామన్నారు. ఉరవకొండతోపాటు మరిన్ని పల్లెలకు నీటిని అందించే నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకులను హెచ్ఎల్‌సీలోని తుంగభద్ర జలాలతో నింపుతున్నారని మంత్రి



పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఆ నీరు ఏటా ఫిబ్రవరి నాటికి బంద్ అవుతాయన్నారు. దీంతోనే నీటి సమస్య తలెత్తుతోందన్నారు. దీన్ని అధిగమించడానికి ఉరవకొండ మండలం ఇంద్రావతి వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ప్రత్యామ్నాయంగా ఆ ఎస్ఎస్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసేలాప్రణాళిక తయారు చేశామన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో తాగునీటి వ్యవస్థను మెరుగు పరచడానికి రూ. 62కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. రెండేళ్లలో ప్రతి పల్లెలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తామని ఉద్ఘాటించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళీధర్, డీఈఈ అంజుమన్, ఏఈఈ ఐజయ్య, సత్యసాయి తాగునీటి పథకం డీఈఈ రామారావు, తహసీల్దారు మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో.. నిధులకు నిరీక్షణ



**అనంతపురం,తెలంగాణ దిశ :** గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేసింది. నాడు-నేడు పథకానికి అరకొరగా నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకొంది. నాడు-నేడు పథకానికే కాకుండా పాఠశాల నిర్వహణకు కూడా ప్రతి సంవత్సరం నిధులు విడుదల చేయాలి. ఆ దశగా వైకాపా ప్రభుత్వం ఆలోచించలేదు. దీంతో పాఠశాల నిర్వహణ భారం ప్రధానోపాధ్యాయులపై పడుతోంది. వాస్తవానికి పాఠశాలల్లో సుద్దముక్కలు, బోర్డు తుడుపుగుడ్డలు, తెల్లకాగితాలు, రిజిస్ట్రర్లు తదితర స్టేషనరీ కొనుగోలుకు పాఠశాల గ్రాంటు ప్రభుత్వం విడుదల చేస్తుంది. 100 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలకు రూ. 10 వేలు, 100 నుంచి 250 మధ్య ఉంటే రూ. 25 వేలు, 500 మంది విద్యార్థులుంటే రూ. 50 వేలు, వెయ్యికి లోపుంటే రూ. 75 వేలు, వెయ్యి దాటితో రూ.లక్ష చొప్పున ఈ గ్రాంటు మంజూరు చేయాలి. మూడేళ్ల నుంచి నిధులు రాకపోవడంతో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏడాదికి రూ.లక్ష చొప్పున ఖర్చు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రధానోపాధ్యాయులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో 2023-24, 2024-25 సంవత్సరంలో ఒక్క రూపాయి కూడా పాఠశాల గ్రాంటు రాలేదు. 2022-23లో కేవలం 25 శాతం నిధులు వచ్చాయి. సుమారు రూ. 6 కోట్ల నిధులు ఉమ్మడి జిల్లాకు ఏటా విడుదల కావాల్సి ఉంది. పాఠశాలల్లో పెద్దపెద్ద మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. 25 శాతం మొదటి విడతలో విడుదల చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ నిధులపై స్పష్టత రావాల్సి ఉంది.రెండేళ్ల ముందు 25 శాతం నిధులు వచ్చాయి. ఆ తరువాత నిధులు రాలేదు. ఈ సంవత్సరం నిధులు మంజూరవుతున్నట్లు తెలిసింది. రాష్ట్రవిద్యాశాఖ నుంచి నేరుగా పాఠశాలలకు ఆన్‌లైన్‌లో నిధులు విడుదల చేస్తారు. లేదా ఎస్ఎస్ఏ కార్యాలయానికి నిధులు వస్తే వెంటనే ప్రధానోపాధ్యాయుల ఖాతాకు పంపిస్తాం.

# చిరుతల మృతితో అప్రమత్తం

**సోమల, తెలంగాణ దిశ :**జిల్లాలో రెండు పులులు మృత్యువాతపడిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. యాదమరి మండలంలో వేటగాళ్లు పన్నిన ఉచ్చులో చిక్కి మగ చిరుత (4-5 ఏళ్లు) బలైంది. తాళ్లమడుగు సమీపంలోని బోడబండ్ల బీట్ పరిధిలో చిరుత కళేబరాన్ని గుర్తించారు. సోమల మండలంలోని ఆవులపల్లె అటవీ పరిధి గట్టువారిపల్లె సమీపంలోని చెరువుకోన అటవీ ప్రాంతంలోని లోయలో మరో చిరుత కళేబరం వెలుగు చూసింది. డీఎఫ్‌వో భరణి, ఎఫ్ఆర్వో శ్రీరాములు ఘటనా స్థలం పరిశీలిం చారు. పశుసంవర్థక ఏడీ శ్రీనివాసులునాయుడు, పశు వైద్యాధికారి చందనప్రియ, తిరుపతి జూపార్క్ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో కళేబరానికి పరీక్షలు నిర్వహించారు. చిరుత వేటగాళ్ల ఉచ్చులో పడిందా విద్యుత్తు తీగలు తగలి మృత్యువాత పడిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. లోయనుదాటే క్రమంలో జారిపడి మృతిచెందినట్లు భావిస్తున్నామని, శవపరీక్ష నివేదిక ఆధారంగా కేసు పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. చిరుతకు కాళ్ల గోర్లు అలాగే ఉన్నాయని మృతిచెంది మూడు రోజులకు పైగా ఉంటుందన్నారు.

# ఇక స్థానిక సంస్థలపై గురి?



**విశాఖపట్టణం, తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కనీవిని ఎరుగని విజయాన్ని సాధించిన టీడీపీ కూటమి ఇక స్థానిక సంస్థలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేయొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం ఏపీలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్ని ఏకగ్రీవం చేయడంపై పలు ఆరోపణలు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, జడ్పీ పీఠాలను దక్కించుకునే క్రమంలో వైసీపీ అక్రమాలకు పాల్పడిందని అప్పట్లో టీడీపీ ఆరోపించింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వానికి ఘర్షణ తలెత్తింది. ఎన్నికల్ని వాయిదా వేసే విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌తో ప్రభుత్వం కయ్యానికి కాలు దువ్వింది. ఆ తర్వాత రకరకాల పరిణామాలు జరిగాయి. కోవిడ్ రెండో దశలో ఉండగా ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్ని నిర్వహించారు. నాటి ఎన్నికల్లో ప్రధాన కార్పొరేషన్లతో పాటుగ్రేడ్ వన్ మునిసిపాలిటీలు, స్థానిక సంస్థలు, జడ్పీ పీఠాలను వైసీపీ దక్కించుకుంది. టీడీపీ పోటీ చేసిన స్థానాల్లో అభ్యర్థుల్ని అడ్డుకోడానికి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆ పార్టీ ఆరోపించింది. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో టీడీపీ క్యాడర్ మొత్తం చెల్లాచెదురై పోయింది. స్థానికంగా పట్టున్న వాటిని కూడా నిలుపుకోలేక పోయింది. ఈ క్రమంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. వైసీపీ పరాజయంలో ఆ పార్టీ తరపున స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహించిన ప్రజా ప్రతినిధులు కీలక పాత్ర పోషించారు. అధికారం ఉందని చెలరేగిపోయారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ ప్రజల్ని పీల్చుకుతిన్నారు. పట్టణాల్లో అయితే భవన నిర్మాణాలకు అనుమతి మొదలుకుని, చిన్న చితక పనులు వరకు ఎక్కడ వీలైతే అక్కడ దోచేశారు. వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పోగవడానికి ప్రజా ప్రతినిధులే కీలక పాత్ర పోషించారు. ఎన్నికల ఫలితాలతో ఒక్కసారిగా పరిస్థితి తారుమారు కావడంతో స్థానిక సంస్థలకు సారథ్యం వహిస్తున్న నాయకులు పక్క చూపులు మొదలు పెట్టారు. మరో రెండేళ్ల పదవీ కాలాన్ని కాపాడుకోవాలంటే అధికార పార్టీలో చేరిపోవడం మేలని భావిస్తున్నారు. స్థానికంగా లభించే ఆదాయాన్ని వదులకోకూడదంటే అధికార పార్టీని ఆశ్రయించడం మేలని భావిస్తున్నారు. వైసీపీ ఇప్పట్లో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే పరిస్థితి లేదని చాలామంది నేతల్లో ఉంది. ప్రస్తుతం పదవుల్లో ఉన్న మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు మొదలుకుని కార్పొరేటర్లు, జడ్పీటీసీ సభ్యుల వరకు వీలైనంత త్వరగా అధికార పార్టీలో చేరిపోడానికి రెడీ అవుతున్నారు.

# అటకెక్కిన అభివృద్ధి...!

**పంగల్, తెలంగాణ దిశ :** పంగల్‌రోడ్డు నుంచి బళ్లారిరోడ్డు వరకు రహదారి విస్తరణ పూర్తయి ఆరు నెలలు దాటుతున్నా అనుబంధంగా చేయాల్సిన అభివృద్ధి పనులు ముందుకు సాగటంలేదు. ఈ రహదారి విస్తరణలో భాగంగా నడిమివంక సమీపంలో ఖాళీ ప్రదేశంలో చిన్నపాటి ఉద్యానవనం ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. అవి పనులు ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. ఇక్కడ ఆహ్లాదం కోసం ఉద్యానవనం ఏర్పాటు చేసి గతంలో ఈ రహదారి వెంట ఉండే పలు ప్రముఖుల విగ్రహాలను ఇక్కడ మరలా పెట్టేందుకు ప్రణాళికలు ఉన్నాయి. అవి కూడా ఏమాత్రం ముందుకు కదలకుండా రెండు విగ్రహాలను ఇక్కడ పెట్టి వదిలేశారు. ప్రస్తుతం అభివృద్ధి పనులేవీ ముందుకు సాగక ఈ ప్రాంతమంతా మట్టికుప్పలతో నిండి ఉంది. అక్కడ ప్రహరీని ఆనుకుని కొందరు రహదారి పక్కనే వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరికోసం షాపుల నిర్మాణం చేయాలని వినతులు ఉన్నాయి. అటు ఉద్యానవనం పూర్తికాక ఇటు దుకాణ సముదాయం పూర్తి కాకుండా వృథాగా మారుతోంది. జాతీయ రహదారుల ఏఈఈ ధనలక్ష్మిని సంప్రదించగా



రహదారి నిర్మాణం అనంతరం సుందరీకరణ పనులు తమ పరిధిలో ఉండవని మున్సిపల్ అధికారులు వాటికి సంబంధించిన పనులు చేస్తారని తెలిపారు. మున్సిపల్ ఈఈ సూర్యనారాయణకు సంప్రదించగా..ఇంకా రహదారి నిర్మాణ పనులు పూర్తి కాలేదని, తమకు నిర్వహణ బాధ్యతలు అప్పగించలేదని తెలిపారు.

# అవస్థల్లో అంగన్‌వాడీలు!

**కరీంనగర్, తెలంగాణ దిశ :** అంగన్‌వాడీల నిర్వహణ భారంగా మారింది. నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో సిబ్బంది వెతలు అంత ఇంత కాదు. చిన్నపాటి ఉద్యోగం చేసే వాళ్లకు చేతినుంచి డబ్బులు పెట్టడం ప్రహాస నంగా మారింది. కేంద్రాలకు నెలల తరబడి అద్దెలు చెల్లించకపోవడంతో యజమానుల నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది. వేతనాల నుంచి చెల్లిద్దామ నుకున్న నెలల తరబడి వేతనాలు సైతం రాక అంగన్‌వాడీ టీచర్ల అవస్థలు అంత ఇంత కాదు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం ఉండటం లేదు. రాష్ట్ర స్థాయిలో నిధులు విడుదల అయితేనే సమస్య పరిష్కారం అవుతుందని, అప్పటి వరకు మేం చేసేదేమీ లేదని జిల్లా స్థాయి అధికారులు సెలవిస్తున్నారు. నాలుగింట ఒకవంతు కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ఖాళీలున్నాయి. సిబ్బంది భర్తీ ప్రక్రియ చేపడుతామని అంటున్నా.. ఇప్పటి వరకు కనీసం విధివిధానాలు సైతం విడుదల కాలేదు. భర్తీకి మరింత సమయం పట్టే అవకాశాలు కని పిస్తున్నాయి. వేసవి సెలవుల అనంతరం కొంగొత్త ఉత్సాహంతో ప్రారంభం కావాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు.. సిబ్బంది ఖాళీలు, నిధుల లేమితో నిర్వహణ భారమై.. మంచి రోజుల కోసం ఎదురుచూస్తున్నాయి. తక్షణమే నిధులు విడుదల చేయాలని జిల్లా




అంగన్‌వాడీ సిబ్బంది ముక్తకంఠంతో కోరుతున్నారు. జిల్లాలో కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, హుజూరాబా ద్, గంగాధర నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 777 అంగన్‌వా డీ కేంద్రాలున్నాయి. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 25 వేల మంది ఉన్నారు. కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల లోపు వారు ఏడు వేల మంది ఉన్నారు. గర్భిణులు, బాలింతలు కలి పి ఎనిమిది వేల మంది ఉంటారు.

# బూడిద చుట్టూ రాజకీయ చిచ్చు!



**పెద్దపల్లి, తెలంగాణ దిశ :**బూడిద రవాణా వ్యవహారం రాజకీయ దుమారం లేపుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల పరస్పర విమర్శలకు కేంద్రంగా మారింది. రామగుండం ఎన్టీపీసీ పరిశ్రమ నుంచి వెలువడే బూడిద రవాణాకు సంబంధించి కాంగ్రెస్, భారాస నేతల మధ్య మాటల యుద్ధం రోజురోజుకూ పెరుగుతోంది. రవాణాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఓ పార్టీ ఆరోపిస్తుండగా.. రాజకీయ కక్షతోనే ఆరోపణలు చేస్తున్నారని మరో పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి చెరువు నుంచి ఇతర ప్రాంతాలకు కొన్నేళ్లుగా బూడిద తరలిస్తున్నారు. 'అక్రమ రవాణాతో పాటు ప్రతి రోజూ రూ.లక్షల్లో అవినీతి జరుగుతోందని, ఇందుకు అధికార పార్టీ ముఖ్య నేత సహకారముంద'ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపణలు ఉమ్మడి జిల్లాలో చర్చకు దారి తీశాయి. తాను స్వయంగా కొన్ని లారీలను పట్టించినప్పటికీ రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొంటుండగా, ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రణవ్ ఖండించారు. కౌశిక్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని, అధికారులు కేసులు నమోదు చేశారనే విషయాన్ని ఆధారాలతో చూపించారు. బూడిద తరలింపు వ్యవహారంలో తమ పార్టీకి సంబంధం లేదని చెప్పడానికి తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే బూడిద తరలింపు వ్యవహారంపై రవాణా శాఖ అధికారులు పక్కాగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. తరలింపు కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు రోజూవారీగా ఎన్ని వాహనాలు వెళున్నాయనే విషయమై వివరాలు పక్కాగా ఉంటేనే బూడిద రవాణా ప్రక్రియ పారదర్శకంగా సాగే వీలుంది. అంతేకాకుండా వాహనాలను మార్గమధ్యంలో తనిఖీలు చేయడం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశముంది. మోతాదు కంటే అధిక పరిమాణంలో సరఫరా చేస్తుండటంతో లారీల వెనుక ప్రయాణించే ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. రామగుండం నుంచి రాజీవ్ రహదారి సహా హుజూరాబాద్, వరంగల్ మార్గంలో నిత్యం వివిధ జిల్లాలకు పెద్ద ఎత్తున బూడిద రవాణా జరుగుతోంది. రాత్రింబవళ్లు వందలాది వాహనాలు వెళ్తుండటంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. లారీలతో పలు చోట్ల రహదారులు ధ్వంసమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమాలు, అవినీతికి తావు లేకుండా బూడిద రవాణా ప్రక్రియ నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ విషయమై పెద్దపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావును 'ఈనాడు' వివరణ కోరగా ఇటీవలి కాలంలో 70 వరకు అనుమతి లేని బూడిద లారీలను పట్టుకొని జరిమానా విధించామని చెప్పారు. బూడిద తరలింపులో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామగుండంలోని బొగ్గు ఆధారిత ఎన్టీపీసీ విద్యుత్తు పరిశ్రమ నుంచి వెలువడే తడి, పొడి బూడిదను అంతర్గాం మండలం కుందనపల్లిలోని ప్రత్యేక చెరువులో నింపుతారు. 500 ఎకరాల్లో ఉన్న ఈ చెరువులో ప్రతి రోజూ టన్నుల కొద్దీ బూడిదను డంప్ చేస్తారు.

# కాలేయాన్ని కాపాడుకుందాం



మానవ శరీరంలో ఒక ముఖ్యమైన అవయవం కాలేయం (లివర్). శరీరం లోపలి అవయవాల్లో ఇదే అతి పెద్దది. ఒకరకంగా దీన్ని అవిశ్రాంత కర్మాగారంతో పోల్చుకోవచ్చు. నిరంతరం ఒకే సమయంలో ఎన్నెన్నో పనులను నిర్వహిస్తుంటుంది. కణజాలాలు, కండరాలు పనిచేయటానికి అవసరమైన శక్తిని అందించే గ్లూకోజు మోతాదులు నియంత్రణలో ఉండటంలో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. రక్తంలో గ్లూకోజు ఎక్కువగా ఉన్నప్పుడు దాన్ని గ్రహించి, తనలో దాచుకుంటుంది. ఎప్పుడైనా గ్లూకోజు మోతాదులు పడిపోయినప్పుడు వెంటనే విడుదల చేస్తుంది. మనం ఆహారం ద్వారా తీసుకున్న కొవ్వు పదార్థాలు జీర్ణం కావటంలోనూ పాలు పంచుకుంటుంది. ఇదొక గ్రంథి కూడా. ఇది స్పాంజిలా, చీలిక ఆకారంలో, ఎరుపు-గోధుమ రంగులో, ఫుట్‌బాల్ పరిమాణంలో ఉంటుంది. ఎత్తు, బరువు ఆధారంగా పరిమాణం మారుతూ వుంటుంది. శరీరంలోని ఇతర భాగాలకు అవసరమైన ప్రోటీన్లు, హార్మోన్లను తయారు చేస్తుంది. ఒక వ్యక్తిలో సగటున మూడు పౌండ్ల బరువు ఉండే కాలేయం అతిపెద్ద అంతర్గత అవయవం. సాధారణ పరిస్థితుల్లో, కాలేయం శరీరం యొక్క కుడి వైపున, పక్కటెముకల కింద ఉంటుంది. సిటస్ ఇన్వర్సస్ అనే స్థితిలో, కాలేయం ఎడమ వైపున ఉంటుంది. ఒత్తిడి, ఇతరత్రా కారణాలతో కాలేయ వ్యాధులు వ్యాపిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటేటా సుమారు 20 లక్షల మంది కాలేయ వ్యాధితో మరణిస్తున్నారంటే పరిస్థితిని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దాదాపు సగం సిర్రోసిస్ సమస్యల కారణంగానూ, ఇంకో సగం వైరల్ హెపటైటిస్, హెపాటోసెల్యులర్ కార్సినోమా కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయి. ఎక్కువగా ఊబకాయం, మందులు, వైరల్ ఇన్ఫెక్షన్లు, అధికంగా ఆల్కహాల్ తీసుకోవటం, జన్యుపరమైన రుగ్మతలు, అధికంగా మద్యం సేవించటం వంటివి కాలేయాన్ని దెబ్బతీస్తాయి. కాలేయ వాపు, దెబ్బతినటంతో మచ్చకణజాలం ఏర్పడటానికి కారణమవుతుంది.

**నిర్ధారించే పరీక్షలు ఇవీ:** కాలేయ జబ్బును గుర్తించటానికి లివర్ ఫంక్షన్ పరీక్షలు ఉపయోగపడతాయి. అయితే ఫ్యాటీ లివర్ వీటిల్లో అంతగా బయటపడదు. పరీక్ష ఫలితాలు అన్నీ నార్మల్‌గా ఉన్నా కూడా లోపల కాలేయం దెబ్బతిని ఉండొచ్చు. అల్ట్రాసౌండ్ పరీక్షలోనైతే బాగా బయటపడుతుంది. ఇందులో లివర్ బాగా మెరుస్తున్నట్టుగా, తెల్లగా కనిపిస్తుంది. దీని ద్వారా సమస్యను తేలికగా, స్పష్టంగా, ఖచ్చితంగా గుర్తించొచ్చు. ఎలాస్టోస్కాన్ పరీక్షలో కాలేయం ఎంతవరకు దెబ్బతిన్నది? ఎంతవరకు గట్టిపడింది? అనేవీ తెలుస్తాయి. అవసరమైతే సీటీ, ఎమ్మారై స్కాన్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. తొలిదశలోనే గుర్తిస్తే మందులు, జీవనశైలి మార్పులతోనే జబ్బు నయమయ్యే అవకాశముంది.

**అధునాతన చికిత్సా పద్ధతులు:** కాలేయ జబ్బుకు సమగ్రమైన చికిత్స చాలా ముఖ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే ఆసుప్రతులు, క్లినిక్‌లలో మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో కూడా అధునాతన శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవా ట్రస్ట్ (ఆరోగ్యశ్రీ) ద్వారా కాలేయ వ్యాధి గ్రస్తులకు చికిత్సలు అందుబాటులోనే ఉంటున్నాయి. అందు వల్ల కాలేయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో అధునాతనమైన చికిత్సలు, పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కాలేయం గట్టిపడినవారికి మార్పిడి అవసరపడొచ్చు. కాలేయంలో ప్రధాన రక్తనాళం మూసుకుపోయినవారికి మరింత జాగ్రత్తగా కాలేయ మార్పిడి చేయాల్సి ఉంటుంది. కాలేయ క్యాన్సర్ గలవారికి కొంత భాగం తొలగించాల్సి రావొచ్చు. క్యాన్సర్ తొలిదశలో ఉంటే చికిత్సతోనే ఫలితం కనిపించొచ్చు. మెటబాలిక్ జబ్బు గలవారికి మందులతోనే నయం కావొచ్చు.

**అనేక రకాల జబ్బులు:** కాలేయ జబ్బు అని ఒకే పేరుతో పిలుచుకున్నా ఇందులో చాలా రకాలున్నాయి. వీటిల్లో ప్రధానమైనవి కాలేయానికి కొవ్వు పట్టటం (ఫ్యాటీ లివర్).. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి ఇన్‌ఫెక్షన్లు.. విల్సన్స్ డిసీజ్ వంటి జీవక్రియల సమస్యలు. సుమారు 80 శాతం కాలేయ జబ్బుకు ఇవే కారణం. వీటికి తోడు క్యాన్సర్. ఇవన్నీ కాలేయాన్ని నిర్వీర్యం చేసేవే. వీటికి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి.

**కాలేయ మార్పిడి:** కిడ్నీ విఫలమైతే డయాలిసిస్‌తో రక్తాన్ని శుద్ధి చేసుకునే వీలుంది. కానీ కాలేయం పూర్తిగా విఫలమైతే ఎలాంటి ప్రత్యామ్నాయమూ లేదు. కాలేయ మార్పిడి ఒక్కటే శరణ్యం. ఇది ప్రాణాలు కాపాడే చికిత్స. దీన్ని చేయించుకున్నవారిలో 85-90 శాతం యథావిధిగా పనులు, ఉద్యోగాలు చేసుకోవటం గమనిస్తున్నాం. శస్త్రచికిత్స ఖరీదైనది కావటమే సమస్య. కానీ జబ్బు తీవ్రమై మాటిమాటికీ ఆసుపత్రిలో చేరి, చికిత్స తీసుకోవటంతో పోలిస్తే ఇదంత ఎక్కువేమీ కాదనే చెప్పుకోవచ్చు. పైగా ప్రాణాలనూ కాపాడుకోవచ్చు. ప్రస్తుతం చాలావరకు సన్నిహిత కుటుంబ సభ్యులు, బంధువుల వంటి సజీవ దాతల నుంచే కాలేయాన్ని తీసుకొని, మార్పిడి చేస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం దాతలైనా, గ్రహీతలైనా నాలుగు వారాల్లోనే తిరిగి మామూలు స్థితికి చేరుకుంటారు. కాలేయం తిరిగి త్వరగానే వద్ధి చెందుతుంది. సగం వరకు కత్తిరించినా రెండు నెలల్లోనే దాదాపుగా యథాస్థితికి చేరుకుంటుంది. కాబట్టి కాలేయ మార్పిడి, అవయవ దానం గురించి భయపడాల్సిన పనిలేదు.

**సిర్రోసిస్ సంకేతాలు ఇవే..:** ఆకలి కోల్పోవడం, బరువు తగ్గడం, బలహీనత, కామెర్లు, దురద, ఎగువ జీర్ణశయాంతర రక్తస్రావం సంకేతాలు, పొత్తికడుపులో వాపు (అస్సైట్స్). ఉదరంలోని అవయవాల చుట్టూ ద్రవం పేరుకుపోతుంది), మూడ్ మార్పులు, గందరగోళం, అసాధారణ నిద్ర విధానాలు, కండరాల తిమ్మిరి, ఇది తీవ్రంగా ఉంటుంది, క్రమరహిత రుతు రక్తస్రావం, వంధ్యత్వం, మగవారిలో రొమ్ము అభివృద్ధి, స్పైడర్ సిరలు..

**చికిత్సలు ఎలా చేస్తారంటే..:** అసిటిస్ (కడుపు వాపు)అసిటిస్ చికిత్సకు, డాక్టర్స్ డైయూరిటిక్స్ అని పిలిచే మందులను సూచిస్తారు, ఇది శరీరం అదనపు ద్రవాన్ని విసర్జించడానికి సహాయపడుతుంది. ఈ పరిస్థితి ఉన్న వ్యక్తులు వారు వినియోగించే సోడియం మొత్తాన్ని తగ్గించాలని కూడా వారు సిఫార్సు చేస్తారు. విపరీతమైన సందర్భాల్లో యుఎస్‌జి పారాసెంటెసిస్ అనే సాంకేతికతను ఉపయోగించి ఉదరం నుండి ద్రవాన్ని తీసేస్తారు. కొన్ని సందర్భాల్లో ట్రాన్స్‌జుగ్యులర్ ఇంట్రాహెపాటిక్ పోర్టోసిస్టమిక్ షంట్ (టిప్స్) అంటే కాలేయంలో ఒక స్టెంట్‌ను ఉంచడం ద్వారా రక్తం కాలేయాన్ని దాటవేయడానికి అనుమతిస్తుంది, ఇది కాలేయంలో మచ్చల కారణంగా ఏర్పడే ఒత్తిడిని కొంతవరకు తగ్గిస్తుంది.

# జిడ్డును అడ్డుకోండి!



కొందరి చర్మం.. జిడ్డుగా ఉంటుంది. సెబమ్ గ్రంథులు అధికంగా నూనెలను ఉత్పత్తి చేయడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. ఇంకొందరిలో జన్యుపరంగా ఉంటే, మరికొందరిలో హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి.. ఇలా రకరకాల కారణాలతో 'జిడ్డు చర్మం' ఇబ్బంది పెడుతుంది. ఇక వేసవిలోనైతే చెమటతో కలిసి.. మరింత అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా.. 'జిడ్డు చర్మం' సమస్యలకు ఇట్టే చెక్ పెట్టొచ్చని అంటున్నారు సౌందర్య నిపుణులు. వేసవిలో చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం ముఖ్యం. ఇందుకోసం రోజుకు కనీసం 8-10 గ్లాసుల నీరు తాగాలి. ఫలితంగా శరీరంలోని విష పదార్థాలు బయటికి పోవడంతోపాటు జిడ్డు కూడా తగ్గుతుంది. జిడ్డు చర్మం ఉన్నవారు ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్, పాల ఉత్పత్తులను తగ్గించాలి. తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. ఇవి చర్మంలో నూనెల ఉత్పత్తిని నియంత్రించడంలో సాయపడతాయి.

చర్మం జిడ్డుగానే ఉంటుంది కాబట్టి వేసవిలో మాయిశ్చరైజర్స్, సన్‌స్క్రీన్ లోషన్స్ వాడాల్సిన అవసరం లేదని అనుకుంటే.. పొరపాటే! కాలానికి అనుగుణంగా ఉత్పత్తులను ఎంచుకోవాల్సిందే! అప్పుడే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. జిడ్డు చర్మం ఉన్నవారు ఆయిల్-ఫ్రీ, వాటర్ బేస్డ్ మాయిశ్చరైజర్స్‌ను వాడాలి. ఎస్పీఎఫ్ 30, అంతకంటే ఎక్కువ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్.. వీరికి మంచి ఎంపిక. ఇవి చర్మాన్ని రక్షిస్తూనే.. జిడ్డును అదుపులో ఉంచుతాయి. వారానికి ఒకసారైనా ముల్తానీ మట్టి, బెంటోనైట్ క్లే మాస్క్‌ను వాడాలి. ఇవి అదనపు జిడ్డును తగ్గించడంతోపాటు చర్మాన్ని శుద్ధి చేస్తాయి. ఎండకాలంలో ఎక్కువగా మేకప్ వేసుకోకపోవడమే మంచిది. అవసరం అనుకుంటే.. తక్కువగా, నాన్-ఆయిలీ ఉత్పత్తులనే ఎంచుకోవాలి. ఈ చిట్కాలను పాటిస్తే.. జిడ్డు చర్మం సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు. ఎండకాలంలోనూ అందంగా మెరిసిపోవచ్చు.


# ఒక్క అడుగుతో పెద్ద మార్పు!



'పక్షులు మానవునికి జీవన గమనం నేర్పుతాయి. వాటిని కాపాడటం మన కర్తవ్యం' అంటారు భారతదేశ పక్షి శాస్త్ర పితామహుడు సలీం అలీ. జీవ పరిణామ క్రమంలో ఉద్భవించిన అద్భుత జంతుజాలమే పక్షులు. ఈ సృష్టిలో పక్షులది ఒక ప్రత్యేకమైన స్థానం. ప్రకృతికి అందాన్ని, మానవాళికి జీవవైవిధ్యంతో పాటు ఆనందాన్ని అందిస్తాయి. 'భూమిపై జీవితం యొక్క గొప్ప ఆనందాలలో పక్షుల గానం ఒకటి' అంటారు ప్రముఖ ప్రకృతి ప్రేమికుడు రాబర్ట్ లిండ్. వీటి జీవన విధానం మనిషికి సహనాన్ని, శ్రమను, స్వేచ్ఛను నేర్పుతాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకమైన పాత్ర పోషిస్తాయి. పక్షులు-పర్యావరణం మధ్య ఉన్న అవినాభావ సంబంధం మానవాళి మనుగడకు అత్యంత ముఖ్యమైనది. వ్యవసాయంలో కీలకమైన పాత్ర వహిస్తాయి. పంటలకు హానిచేసే, కీటకాలను, పురుగులను తినడం ద్వారా తెగుళ్లు రాకుండా పరోక్షంగా పంటలను రక్షిస్తాయి. పువ్వుల్లోని పుప్పొడిని ఒకచోటు నుండి మరోచోటుకు తీసుకువెళ్లి పునరుత్పత్తికి సహాయపడతాయి. విత్తనాలను వ్యాప్తి చేయడంలో సహాయపడటం ద్వారా అడవుల పెరుగుదలకు సహకరిస్తాయి. చనిపోయిన జంతువులను తినే రాబందు వంటి పక్షులైతే పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడంలోనూ సహాయపడతాయి. అందుకే-'పక్షులు వ్యవసాయానికి, పర్యావరణానికి సహజ మిత్రులు' అంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే, పక్షులు మానవాళికి అవసరమైన ఆహార గొలుసులో ముఖ్యమైన భాగంగా ఉంటూ పర్యావరణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్రాముఖ్యతను వివరిస్తూ 'ప్రతిదీ మరొకదానితో ముడిపడి ఉంది' అంటారు జాన్ ముయిర్. పర్యావరణంలోని ఈ సంక్లిష్టమైన సంబంధాలలో పక్షులు ఒక ముఖ్యమైన బంధం. పక్షులు, మూగజీవాలు కళ్ల ముందే చనిపోతున్నా పెద్దగా పట్టించుకోరు చాలామంది. కానీ, ఓ పక్షి ప్రాణాలు కాపాడేందుకు స్వయంగా జడ్జి, కలెక్టర్ రంగంలోకి దిగారు. కన్నూరు జిల్లా, ఉల్లిక్కల్ పంచాయతీ పరిధిలోని మూసేసిన ఓ టెక్స్‌టైల్ షాపు గ్లాస్ ప్యానెల్‌లో ఓ పక్షి చిక్కుకుంది. ఆ ప్యానెల్‌లో నుంచి బయట పడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తుంది. కానీ సాధ్యం కాలేదు. పక్కనున్న షాపులవాళ్లు చూసినా కాపాడలేని పరిస్థితి. బిజినెస్ పార్ట్‌నర్స్ మధ్య ఏర్పడిన వివాదం కారణంగా ఆ షాపును కొన్ని నెలల క్రితం కోర్టు సీజ్ చేసింది. షాపు తెరవాలంటే, కోర్టు అనుమతి తీసుకోవాల్సిందే. ఇందుకోసం జిల్లా కలెక్టర్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా రంగంలోకి దిగారు. దీనిపై స్పందించిన జడ్జి%ొ% నేరుగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. షాపును తెరిపించి, మూడు రోజులపాటు గ్లాస్ ప్యానెల్‌లో చిక్కుకున్న పక్షిని ప్రాణాలతో కాపాడారు. ఆ పక్షి%ొ% స్వేచ్ఛగా గాల్లోకి ఎగిరిపోయింది.

అయితే, పక్షుల మనుగడ నేడు ప్రమాదంలో పడింది. ఈ ఒక్క పక్షినైతే రక్షించగలిగారు. కానీ, పట్టణీకరణ, అడవుల నిర్మూలన, కాలుష్యం, వ్యవసాయంలో రసాయనాల వినియోగం వల్ల పక్షుల ఆవాసాలు తగ్గిపోతున్నాయి. ఆహారం లభించక, విషపూరితమైన వాతావరణంలో జీవించలేక అనేక పక్షి జాతులు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. 'అభివృద్ధి క్రమం అంతా ప్రకృతి హక్కుల ఉల్లంఘనే' అంటారు పర్యావరణ కార్యకర్త సత్యశ్రీనివాస్. ఆధునిక సాంకేతికత అభివృద్ధి వల్ల పక్షుల మనుగడకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోంది. సెల్‌టవర్ల నుంచి వచ్చే రేడియో తరంగాలు వీటిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పక్షుల సంఖ్య తగ్గిపోవడం కేవలం ప్రకృతికి జరిగే నష్టం మాత్రమే కాదు, ఇది మానవాళి మనుగడకు కూడా పెను ముప్పుగా మారుతున్నది. పక్షులు, పర్యావరణం మనకు వారసత్వంగా లభించిన సంపద. ఈ సంపదను కాపాడుకోవడం ద్వారానే భవిష్యత్తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించగలం. 'పక్షులను కాపాడటం అంటే, ప్రకృతిని కాపాడటం. ప్రకృతి లేని జీవితం అసంభవం' అని ఎల్డో లియోపోల్డ్ అంటారు. చిన్నచిన్న చర్యలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నట్లుగా కలెక్టర్, జడ్జి మాదిరిగా, పర్యావరణ పరిరక్షణకు మనం వేసే ఒక్క అడుగే పెద్ద మార్పునకు దారితీస్తుంది.

# దాస్యభక్తికి నిలువెత్తు నిదర్శనం!



తిరుమల, : భక్తితత్పరులు అయినవారు నవవిధ భక్తిమార్గాల ద్వారా దైవాన్ని చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఈ భక్తి విధానాల్లో దాస్యభక్తికి నిలువెత్తు నిదర్శనం హనుమంతుడు. అనంత శక్తులు తనలో దాగి ఉన్నా.. రామబంటుగా ఒదిగి ఉండటవే దాసాంజనేయు డికి ఇష్టం. ఆ పరమభక్తుడు పిల్లల దేవుడు, పెద్దల దేవుడు, అందరి దేవుడు. నమ్మిన దైవంపై పరిపూర్ణమైన అంకితభావం కలిగి ఉండాలి. నిరంతరం స్వామి సేవలో తరిస్తూ ఇది తప్ప మరేదీ తనకు అవసరం లేదని ఆంజనేయుడు ప్రార్థించేవాడు. భవబంధచ్ఛిదే తస్యై స్పృహయామి న ముక్తయే భవాన్ ప్రభురహం దాస ఇతి యత విలుప్యతే'ఓ ప్రభూ! ఈ భవబంధాల నుంచి నన్ను విముక్తుడిని చేయదలిచితే చేయి. మోక్షాన్ని ప్రసాదించాలనుకుంటే, ప్రసాదించు. కానీ, నేను మాత్రం ఇవేవీ కోరుకోను. మీపై నా దాస్య భావనను మరిపించేదేదీ నాకు అవసరం లేదు' అని వినయంగా వేడుకుంటాడు హనుమ. పురాణాలను అనుసరించి హనుమ చిరంజీవి. నిరంతరం రామనామాన్ని జపిస్తుంటాడు. అంతేకాదు, ఎక్కడైనా రామనామం వినిపిస్తే చాలు.. అక్కడికి వెళ్లిపోతాడు. ఆనందబాష్పాలు నిండిన కండ్లతో, చేతులు జోడించి అక్కడే ఉంటాడు. రామకథా గానం చేస్తున్న భక్తుల సేవా సంకల్పాన్ని పవనసుతుడు మరింత బలపరుస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి. సురోవసురో వాప్యథ వానరో నరఃసర్వాత్మనా యః సుకృతజ్ఞముత్తమమ్‌భజేత రామం మనుజాకృతిం హరిం య ఉత్తరాన నయత్కోసలాన్దివమితి (భాగవతం)'సురులు గానీ, అసురులు గానీ, నరులు గానీ, వానరులు గానీ, మానవమాత్రునిగా ఈ లోకంలో అవతరించిన దేవాదిదేవుడైన ఆ శ్రీరామచంద్ర ప్రభువును ఆరాధించాలి.

భక్తుడు ఆచరించే తృణమాత్రపు సేవనైనా ప్రేమతో స్వీకరించే ఆ స్వామిని సేవించడానికి కఠోర తపస్సులు ఆచరించ అవసరం లేదు. భగవంతుడు ప్రీతి చెందితే, తన భక్తుడికి సార్థకత చేకూరినట్టే. రామచంద్రుడు అయోధ్య వాసులందరికీ తన స్వధామాన్ని (వైకుంఠాన్ని) అనుగ్రహించాడు' అని పలికిన హనుమంతుడి మాటలు రామభక్తులకు కొండంత బలాన్నిస్తాయి.

# గాడిద బద్ధకం



ఒక ఊరిలో ఓ రైతు పొలం పనులకు గాడిదని ఉపయోగించేవాడు. పొలం దున్నడం, కుప్ప నూర్చడం, పొలం నుండి పంట కళ్లానికి చేర్చడం, ధాన్యం బస్తాలు ఇంటికి చేర్చడం వంటి పనులు అన్నీ ఆ గాడిదతోనే చేయించేవాడు. గాడిదకు తిన్నంత ఆహారం పెట్టేవాడు. దాన్ని ఒక జంతువులా కాకుండా తన ఇంటి సొంత మనిషిలా చూసు కునేవాడు. కాని ఆ గాడిదకు ఒక చెడ్డ అలవాటుంది. దానికి బద్ధకం ఎక్కువ. పని చేయడానికి ఇష్ట పడేదికాదు. ఒక్కోసారి పని తప్పించుకోవటానికి అనారోగ్యంలా నటించేది. రైతుతో సేవలు చేయించుకునేది. ఇలా బాగా బద్ధకానికి అలవాటు పడిన గాడిద, రైతు నుండి ఏ మాత్రం పనిలేని చోటుకి వెళ్లిపోవాలనుకునేది. తగిన సమయం కోసం ఎదురు చూసేది. ఒక రోజు రైతు పొలంలోకి రాజు గారి గుర్రం ఒకటి మేత మేయడానికి వచ్చింది. 'ఆ గుర్రంతో రాజు గారి గుర్రంశాలకు నేను కూడా చేరుకుంటే భలే ఉంటుంది. అక్కడ ఎక్కువ గుర్రాలు ఉంటాయి. అన్ని గుర్రాల మధ్య పని తేలికగా తప్పించుకోవచ్చు. ఆకారంలో నేను కూడా గుర్రం లాగే ఉంటాను కదా!' అనుకుంది. గుర్రంతో మాటలు కలిపింది. 'ఇక్కడ పని ఎక్కువ. ఆహారం అసలు పెట్టడం లేదు. రైతు సరిగా చూసుకోవడం లేదు' అని అబద్ధాలు చెప్పి ఏడ్చింది. గుర్రం 'సరే' అంది. సాయంత్రం గుర్రం లాగే తయారై రాజుగారి గుర్రం శాలకు చేరుకుం ది. అక్కడా దాంతో గాడిద చాకిరీ చేయించారు. పైగా రైతు దగ్గర ఉన్నంత స్వేచ్ఛ ఆ గుర్రంశాలలో గాడిదకి దొరకలేదు. పైగా కొట్టి మరీ పరుగులు పెట్టిస్తున్నారు. ఆయాసంతో దానికి నీరసం వచ్చే సేది. ఒక రోజు ఆ గుర్రాలశాల నుండి ఎలాగైనా తప్పించుకోవాలని అనుకుంది. కాపరి వచ్చినప్పుడు ఓండ్రించింది. అంతే కాపరి దాన్ని గుర్రాలశాల నుండి తరిమికొట్టాడు. బతుకుజీవుడా అనుకుంటూ గాడిద రైతు పొలం వైపు పరుగు లంకించుకుంది. ఆ రోజు నుండి రైతు చెప్పిన పనులు బుద్ధిగా చేసింది. తప్పిపోయిన తన గాడిద తిరిగి వచ్చినందుకు రైతు

# మిమ్మల్ని చూస్తే భయమేస్తుంది..!




సోషల్‌మీడియా ట్రోలర్స్‌పై అగ్ర కథానాయిక త్రిష ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిది విషపూరిత మనస్తత్వమని, అలాంటి వారు రాత్రిళ్లు ప్రశాంతంగా ఎలా నిద్రపోగలుగుతారని ప్రశ్నించింది. 'పనీపాట లేకుండా ఖాళీగా ఉంటూ పిచ్చి పోస్ట్‌లతో కాలక్షేపం చేయడమేనా మీ పని? నిజంగా మిమ్మల్ని చూస్తే భయమేస్తుంది. అలాగే మీతో పాటు ఉండే సన్నిహితులు, స్నేహితుల విషయంలో బాధగా అనిపిస్తున్నది. పిరికివారు, మానసిక స్థితి సరిగ్గా లేని వారు మాత్రమే అకారణంగా విద్వేషాన్ని ప్రదర్శిస్తారు. మీ అందరికి మంచి బుద్ధిని ప్రసాదించాలని ఆ దేవున్ని కోరుకుంటున్నా' అని త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. గతంలో కూడా సోషల్‌మీడియా తప్పుడు వార్తలపై త్రిష అసహనం వ్యక్తం చేసింది. అజిత్‌తో కలిసి త్రిష నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమాలో త్రిష పర్‌ఫార్మెన్స్‌పై కొందరు ట్రోల్స్ చేశారు. తమిళ అమ్మాయి అయివుండి వేరే వాళ్లతో డబ్బింగ్ చెప్పించడం ఏ మాత్రం బాగోలేదని విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో ట్రోలర్స్‌నుద్ధేశించి త్రిష తాజా పోస్ట్ పెట్టిందని అంటున్నారు.


# కేన్స్‌లో 'హోమ్ బౌండ్'

ఇషాన్ ఖట్టర్, జాన్వీకపూర్ కీలక పాత్రల్లో నటించిన 'హోమ్ బౌండ్' చిత్రం ప్రతిష్టాత్మక కేన్స్ అంతర్జాతీయ చిత్రోత్సవంలో ప్రదర్శితం కానుంది. 'అన్ సర్టెన్ రిగార్డ్' కేటగిరిలో ఈ సినిమాను స్క్రీనింగ్ చేయబోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కళాత్మక విలువలతో రూపొందిం చిన చిత్రాలను ఈ విభాగంలో ప్రదర్శిస్తారు. హైదరాబాద్‌కు చెందిన నీరజ్ ఘైవాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆయన తొలిచిత్రం 'మసాన్' (2015) సైతం కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఎంపిక కావడం విశేషం. మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్ వేదికగా జరగనున్న 78వ కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో 'హోమ్ బౌండ్' చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. తన సినిమా కేన్స్‌కు ఎంపిక కావడం పట్ల జాన్వీక పూర్ ఇన్‌స్టా వేదికగా ఆనందం వ్యక్తం చేసింది. భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి తెలియజెప్పిన క్షణాలివని, ఇది తన బృందం మొత్తానికి దక్కిన గౌరవమని వ్యాఖ్యానించింది. భారతీయ కథల గొప్పదనాన్ని ప్రపంచం గుర్తిస్తున్నదని చిత్ర నిర్మాతల్లో ఒకరైన కరణ్‌జోహార్ అన్నారు.



# 5 నిమిషాల పాట కోసం.. రూ.1 కోటి తీసుకున్న మిల్కీ బ్యూటీ...





మిల్క్ బ్యూటీ తమన్నా ఒకవైపు సినిమాల్లో హీరోయిన్‌గా తన కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తూనే స్పెషల్ సాంగ్స్‌లో తన డ్యాన్స్‌తో వెరిసిపోతోంది. రీసెంట్‌గా వచ్చిన చాలా సినిమాలలో తమన్నానే స్పెషల్ సాంగ్‌లో మెరిసింది. దీంతో స్పెషల్ సాంగ్ అంటే తమన్నానే అనేంతగా ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించింది ఈ భామ. ఏ పాటైనా సరే,తన అద్భుతమైన డ్యాన్స్ స్కిల్స్, సహజమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తూ కట్టిపడేస్తోంది. అందుకే నిర్మాతలు స్పెషల్ సాంగ్ కోసం ముందుగా తమన్నానే సంప్రదిస్తున్నారు, ఆమె మ్యాజిక్ సినిమాకు మరింత ఆకర్షణను జోడిస్తుందని నమ్ముతున్నారు. ఈ క్రమంలోనే తమ్ము బ్యూటీ బాలీవుడ్ నుంచి వస్తున్న రైడ్ 2 చిత్రంలో ఒక స్పెషల్ సాంగ్‌లో నటించింది. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో వాణికపూర్ కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాకు రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో తమన్నా నషా అనే ప్రత్యేక గీతంలో నటించి అలరించింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ పాట 24 గంటల్లోనే 12 మిలియన్ వ్యూస్ సాధించి, యూట్యూబ్?లో టాప్? ట్రెండింగ్?లో దూసుకెళ్తోంది.

అయితే ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న ఈ స్పెషల్ సాంగ్ కోసం తమన్నా ఎంత రెమ్యూనరేషన్ తీసుకుందనే చర్చ బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. హీరోయిన్‌గా భారీ పారితోషికం అందుకునే ఈ మిల్క్ బ్యూటీ, స్పెషల్ సాంగ్స్ కోసం కూడా దాదాపు అదే స్థాయిలో వసూలు చేస్తుందని టాక్. ఈ నేపథ్యంలో 'నషా' పాటలో తన అద్భుత డాన్స్‌తో మెరిసిన తమన్నా, ఏకంగా రూ.1 కోటి రెమ్యూనరేషన్ అందుకున్నట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. కేవలం 5 నిమిషాల స్క్రీన్ ప్రెజెన్స్ కోసం తమ్ము భారీగా డిమాండ్ చేసిందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

# థాజ్జ్ ద వైబ్" అంటూ రష్మిక మందన్న పోస్ట్..

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఈ బ్యూటీ పుష్ప, యానిమల్ వంటి చిత్రాలతో డబుల్‌స్టార్ డమ్ సంపాదించుకుంది. ముఖ్యంగా పుష్ప రెండు భాగాల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సరసన నటించి ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్ అయిపోయింది. రీసెంట్‌గా ఈ రష్మిక మందన్న అద్భుతమైన చిత్రం ఛావాలో నటించి మెప్పించిది. తన అద్భుతమైననటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్ని కొల్లగొట్టింది. ప్రారంభంలో ఈ బ్యూటీ నటించిన సినిమాలు కూడా హిట్ టాక్ సొంతం చేసుకున్నాయని చెప్పుకోవచ్చు. మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఛలో, గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ వంటి సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించింది. ఇకపోతే ఈ బ్యూటీ అటు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ.. సోషల్ మీడియాలోని అభిమానులతోతరచూటచ్‌లో ఉంటుంది. తరచూ ఏదోఒక పోస్ట్‌తోఅభి మానుల్ని ఆకట్టుకుంటోంది. తాజాగా రష్మిక మందన్న తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓపోస్‌పెట్టింది. "కొన్నిసార్లు మీరు పోజులు ఇవ్వడం.. ఇతర పనులతో చాలా పని పూర్తి చేసినప్పుడు మీకు



ఏమీ చేయాలని అనిపించదు. కానీ మీ బెస్టీ మిమ్మల్ని తిరిగి పొందారు. థాజ్జ్ ద వైబ్" అంటూ రష్మిక మందన్న రాసుకొచ్చింది. ఇకపోతే రీసెంట్‌గా ఈ ముద్దుగుమ్మ పుట్టిన రోజును గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్న విషయం తెలిసిందే.

# మళ్లీ లాభాల బాట పట్టిన స్టాక్ మార్కెట్



ఇటీవల కాలంలో ప్రపంచ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా తగ్గుతున్నాయి. బంగారం ధరలు భారీగా తగ్గడం లేదా పెరగడం అనేది అంతర్జాతీయ మార్కెట్ల పై ఆధార పడి ఉంటుంది సాధారణంగా స్టాక్ మార్కెట్లు పతనం అయినప్పుడు, బంగారం ధర పెరుగుతుంది. అదే సమయంలో స్టాక్ మార్కెట్ మళ్లీ లాభాల బాట పట్టినప్పుడు బంగారం ధర తగ్గుతుంది ఈ రెండింటికి దగ్గర సంబంధం ఉందిప్రపంచ మార్కెట్లో గత 10 రోజుల్లో బంగారం ఔన్సుకు 300 డాలర్ల వరకు తగ్గింది. అంటే ఔన్సుకు 3500 డాలర్ల నుంచి నుండి 3200 డాలర్లకు పడిపోయింది. బంగారం ధర తగ్గడానికి అమెరికా, చైనా ప్రధాన కారణాలుగా ఉన్నాయి. కార్మిక దినోత్సవం కారణంగా చైనాలో మే 5 వరకు సెలవులు ఉన్నాయి. దీని కారణంగా డిమాండ్ పడిపోయింది. దీంతో పాటు, అమెరికాలో సంతృప్తికరమైన ఉపాధి గణాంకాలు, అమెరికా–చైనా సుంకాల యుద్ధంలో సడలింపు సంకేతాలు, త్వరలో కొత్త ఒప్పందం కుదుర్చుకుంటుందనే ఆశల నేపథ్యంలో బంగారం ధరలను తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. అయితే భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి సంకేతాలు కనిపిస్తున్నాయని, అందువల్ల పెద్ద క్షీణతకు అవకాశం లేదని మరికొంత మంది చెబుతున్నారు. బంగారం ధరలు తగ్గడానికి అనేక ప్రధాన కారణాలు ఉన్నాయి. ప్రపంచ వాణిజ్య చర్చలపై మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడటంతో ఈ వారం బంగారం ధరలు తగ్గాయి. భారతదేశం, జపాన్, దక్షిణ కొరియా, చైనాలతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అవకాశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లేవనెత్తారు. చైనాకు సంబంధించిన సోషల్ మీడియా పోస్టులు అమెరికా సుంకాలపై చర్చలను తిరిగి ప్రారంభించిందని పేర్కొన్నాయి. ఇది కాకుండా చైనాలో సెలవుల వల్ల కూడా బంగారం ధరలు తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. చైనాలో కార్మిక దినోత్సవ సెలవుల కారణంగా మే 1 నుంచి 5 వరకు మార్కెట్ మూసిశారు. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం వినియోగించే దేశం చైనా కాబట్టి ఈ కాలంలో డిమాండ్ తగ్గింది. అమెరికాలో ఉపాధి నివేదిక కూడా బంగారం ధరలపై ప్రభావం చూపింది. ఏప్రిల్‌లో అమెరికాలో 1.77 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించారని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ వారం బంగారం క్షీణత వార్తల్లో నిలిచినప్పటికీ బంగారానికి దీర్ఘకాలిక మద్దతు బాగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దానిని బలపరిచే అనేక అంశాలు ఉన్నాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నేపథ్యంలో బంగారం ధరలు ఇంక తగ్గవని కొంత మంది నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారంలో పెట్టేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. గతేడాది ఏప్రిల్ నెలలో 10గ్రాముల 24క్యారట్ల గోల్డ్ రేటు రూ.75వేలుగా ఉంది. అప్పటి నుంచి దాదాపు 25శాతం వరకు గోల్డ్ రేటు పెరిగింది. 2025 ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టగానే చైనా సహా ప్రపంచ దేశాలు అన్నింటిపైన సుంకాలు పెంచేశారు. వాణిజ్య యుద్ధం కారణంగా బంగారం ధరలు రికార్డు స్థాయిలను నమోదు చేశాయి. ప్రస్తుతం గోల్డ్ రేటు క్రమంగా తగ్గుతుంది.ఏంజెల్ వన్‌లో కమోడిటీస్, కరెన్సీల చీఫ్ టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ తేజస్ అనిల్ షిగ్రేకర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. దక్షిణ కొరియా, జపాన్, భారతదేశంతో సంభావ్య వాణిజ్య ఒప్పందాల గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనలతోపాటు.. చైనా, అమెరికా మధ్య ట్రేడ్ వార్ ఉధృతి కూడా కాస్త తగ్గుముఖం పట్టింది. దీంతో బంగారం ధరలు తగ్గుదలకు కారణం అవుతున్నాయని తెలిపారు.నిర్మల్ బ్యాంగ్ కమోడిటీస్ రీసెర్చ్ హెడ్ కునాల్ షా మాట్లాడుతూ.. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల్లో అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్సు కు 3,000 డాలర్ల లేదా 2,950 డాలర్లకు చేరుకుంటుంది. భారత్‌లో 10గ్రాముల 24క్యారట్ల గోల్డ్ రేటు రూ. 88,000 దిగువకు పడిపోతుందని ఆయన అంచనా వేశారు. ఇదే అభిప్రాయాన్ని ఏంజెల్ వన్ కు చెందిన అనిల్ షిగ్రేకర్ వ్యక్తం చేశారు.



వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం వల్ల బంగారంపై ఇన్వెస్టర్ల పెట్టుబడి తగ్గుతుందని, తద్వారా రాబోయే కొద్దికాలంలో గోల్డ్ రేటు మరింత తగ్గుతుందని అంచనా వేశారు.బంగారాన్ని సేఫ్ ఇన్వెస్ట్మెంట్ అని పిలుస్తారు. ఇందులో పెట్టుబడి పెట్టడం ద్వారా బంగారానికి డిమాండ్ ఏర్పడి ధరలు భారీగా పెరుగుతాయి. అయితే మళ్లీ స్టాక్ మార్కెట్లో లాభాల బాట పట్టిందంటే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారం నుంచి తొలగించి స్టాక్ మార్కెట్లో పెడతారు.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215